



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 79 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 12 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## అమెరికాలో మోదీ-పుతిన్ సెల్ఫీ వైరల్..



### మీకు నోబెల్ రాదంటూ ట్రంప్‌పై విమర్శలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటన.. అమెరికా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఆ పర్యటన భారత ప్రధాని మోదీ-పుతిన్‌ల మధ్య స్నేహబంధాన్ని మరోసారి వెల్లడి చేసింది. పుతిన్ భారత్‌లో దిగగానే మోదీ మిగతా .. 2లో..

## అఫ్గాన్‌పై పాక్ దాడులను ఖండిస్తున్నాం : భారత్

**విశ్వం వాయిస్ న్యూస్ :** అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ వైమానిక దాడులకు పాల్పడటాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. చిన్నారులు, మహిళలు, క్రికెటర్లపై దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన చర్చలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా .. 2లో..



## మీ కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండండి..

### మమతా బెనర్జీ తీవ్ర వ్యాఖ్యలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమతా బెనర్జీ గురువారం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా మహిళలకు ఉసిగొల్పారు. ఆ సవరణ తర్వాత ఓటరు జాబితాలో మిగతా .. 2లో..





### ఆధునిక పరిశోధనల కేంద్రంగా

# అమరావతి క్వాంటం వ్యాలీ

★ కొత్త ఔషధాలపై పరిశోధనకు ముందుకు వచ్చిన గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీ

★ సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయిన పరిశోధకులు, విద్యావేత్తల బృందం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అమరావతిలో ఏర్పాటు అవుతున్న క్వాంటం వ్యాలీ ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. విద్య, వైద్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ రంగాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం పనిచేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో గురువారం వివిధ దేశాల నుంచి బృందంగా వచ్చిన పరిశోధకులు, విద్యావేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల బృందంతో సీఎం సమావేశం అయ్యారు. వైద్యరంగంలో నూతన ఔషధాల రూపకల్పనతో పాటు మెటీరియల్ సైన్స్ పై పరిశోధనలకు గానూ గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమని పరిశోధకులు, విద్యావేత్తల బృందం ముఖ్యమంత్రికి తెలిపింది. దేశంలోనే తొలి క్వాంటం బయోమెడికల్ రీసెర్చ్ ఎకో సిస్టంగా ఏర్పాటు అవుతున్నట్టు వివరించింది. గ్లోబల్ క్వాంటం బయో ఫౌండ్రీ బృందం సభ్యులకు అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి.. వైద్యారోగ్యం, ఔషధాల రూపకల్పన సహా వివిధ అంశాల్లో విస్తృతంగా పరిశోధనలు జరగాల్సి ఉందని అన్నారు. క్వాంటం పరిశోధనలతో బయోసెన్సార్ల లాంటి అప్లికేషన్లను కూడా మిగతా .. 2లో..

### ఎఐ, క్లీన్ టెక్, రెన్యువబుల్ ఎనర్జీ

## పెట్టుబడులకు సహకరించండి

### టొరంటో కాన్సలేట్ జనరల్, సిఐబిసి ప్రతినిధులతో మంత్రి లోకేష్ భేటీ



**టొరంటో (కెనడా), విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రగతిశీల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోంది, ఎఐ, క్లీన్ టెక్, రెన్యువబుల్ ఎనర్జీ, మౌలిక సదుపాయాల రంగంలో ఆస్ట్రేలియా పెట్టుబడులకు సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. టొరంటో కాన్స లేట్ జనరల్ ఆఫ్ ఇండియా మిగతా .. 2లో..

### జగన్ విమర్శలపై

## భాజపా దీటుగా కౌంటర్ ఇవ్వాలి : ప్రధాని మోదీ

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో సీఎం చంద్రబాబుతో కలిసి ముందుకు సాగడం మంచి పరిణామమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రంలో పరిపాలనపై కూడా మంచి ఫీడ్ బ్యాక్ వచ్చిందని చెప్పారు. గురువారం దిల్లీలో ఏపీ, తెలంగాణ, అండమాన్ రాష్ట్రాల భాజపా ఎంపీలకు ప్రధాని అల్పాహార విందు ఇచ్చారు. 15 మంది ఎంపీలతో సుమారు అరగంటపాటు ఆయన మాట్లాడారు. పెట్టుబడులు ఎక్కువగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళుతు న్నాయని.. ఇది చాలా మంచి అభివృద్ధి అని మిగతా .. 2లో..



### తెలుగు భాష ప్రపంచానికి తెలిసేలా

## అధికార భాషా సంఘం పని చేస్తుంది..

### మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్‌గా పి.త్రివిక్రమరావు

### పదవీ బాధ్యతల స్వీకరోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచం నలుమూలలా తెలుగు భాష ఔన్నత్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేలా అధికార భాషా సంఘం సారధిగా, వారధిగా పనిచేస్తుందని మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం నూతన చైర్మన్ పి.త్రివిక్రమరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్‌గా నియమితులైన పి.త్రివిక్రమరావు (విక్రమ్ పూల) గురువారం మిగతా .. 2లో..



## ఏపీలో హస్త కళలకు మరింత ప్రోత్సాహం

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత
- ఏపీ హస్త కళాకారులకు 5 జాతీయ స్థాయి అవార్డుల రాకపై మంత్రి హర్షం
- కూటమి ప్రభుత్వ ప్రోత్సాహంతోనే అవార్డుల రాక
- ఈ నెల 13న అవార్డు గ్రహీతలకు శ్రీకాళహస్తిలో సన్మానం
- 100 మంది హస్త కళాకారులకు టూల్ కిట్ల పంపిణీ
- ఒక్కో టూల్ కిట్ విలువ రూ.10 వేలు
- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో హస్త కళలకు మరింత ప్రోత్సాహమందివ్వనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. జాతీయ హస్త కళల వారోత్సవాల్లో భాగంగా రెండ్రోజుల కిందట ఢిల్లీలో భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ 2023, 2024కు సంవత్సరాలకు సంబంధించి ప్రకటించిన అవార్డుల్లో ఏపీకి చెందిన అయిదుగురు హస్త కళాకారులు మిగతా .. 2లో..



## రాయచోటిలో పంచాయితీ రాజ్ రోడ్లకు మహర్దశ

### మొత్తం 38.08 కిలోమీటర్ల మేర 12 పంచాయతీరాజ్ గ్రామీణ రహదారులు మంజూరు రూ. 21.16 కోట్లుతో రహదారుల నిర్మాణం

**రాయచోటి, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నమయ్య జిల్లా, రాయచోటి నియోజకవర్గ రూపు రేఖలు మార్చేందుకు రోడ్లను మంజూరు చేసిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక మిగతా .. 2లో..



### ఉత్కంఠ మధ్య..

## కళ్యాణదుర్గం మున్సిపాలిటీ తెదేపా కైవసం

**కళ్యాణదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గం మున్సిపాలిటీని తెదేపా కైవసం చేసుకుంది. ఉత్కంఠ పరిణామాల మధ్య మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా తలారి గౌతమి ఎన్నికయ్యారు. గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహిం చారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా.. వైకాపా నుంచి మిగతా .. 2లో..

## అమిత్ షా ఆందోళనగా కనిపించారు..

### -: రాహుల్ గాంధీ :-

**విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిన్న కంగారుగా కనిపించారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదని విమర్శించారు. ఎన్నికల సంస్కరణలపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా మాట్లాడిన సంగతి తెలి సిందే. ఆ ప్రసంగాన్ని ఉద్దేశించే గురువారం రాహుల్ మీడియాతో మాట్లాడారు. "నిన్న అమిత్‌షాజీ ఆందోళనగా మిగతా .. 2లో..



### మాచర్ల కోర్టులో లొంగిపోయిన

## పిన్నెల్లి సోదరులు



**మాచర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి కోర్టులో లొంగి పోయారు. గురువారం ఉదయం పల్నాడు జిల్లా మాచర్లలోని జూనియర్ అదనపు సివిల్ జడ్జి కోర్టుకు వారిద్దరూ వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోస్తు ఏర్పాటు చేశారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెదేపా నాయకులు, సోదరులైన జవ్విశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులు మిగతా .. 2లో..

## ఆదోనిలో అగ్నిప్రమాదం



**ఆదోని, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు జిల్లా ఆదోనిలో అగ్నిప్రమాదం జరిగింది. ఎన్‌డీబీఎల్ పత్తి జిన్నింగ్ పరిశ్రమలో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీగా మంటలు చెలరేగడంతో అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు. భారీగా ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం.

## బీటెక్ విద్యార్థి దారుణ హత్య

### ప్రేమ వ్యవహారమే కారణం - అమ్మాయి కుటుంబ సభ్యులే చంపారని బాధితుల ఆరోపణ



**జిన్నారం(అమీన్‌పూర్), పెనుగంచిప్రోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమ వ్యవహారం ఓ యువకుడి నిండు ప్రాణం బలి తీసుకుంది. ప్రేమించిన యువతి ఇంటికి వెళ్లిన యువకుడిని... ఆమె కుటుంబ సభ్యులు తర్వాతి రోజు ఆసుపత్రికి తరలించడం... తీవ్ర గాయాలతో ఉన్న అతను అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించడం గమనార్హం. హైదరాబాద్ అమీన్‌పూర్ ఠాణా పరిధిలో దారుణం వెలుగుచూసింది. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన కాకాణి శ్రవణ్ సాయి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# అమెరికాలో మోదీ-పుతిన్ సెల్ఫీ వైరల్..

ఆయనకు స్వాగతం పలికి కారులో కలిసి వస్తున్నప్పుడు తీసుకున్న సెల్ఫీ వైరల్ అయింది. ఇప్పుడు అదే ఫొటో అమెరికా రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఒక్క చిత్రం ఎన్నో అర్థాల్ని వెల్లడి చేస్తోందని అగ్రరాజ్య చట్టసభ సభ్యురాలు సిడ్నీ కమ్‌లాగర్ దువ్ హెచ్చరించారు. భారతపై ట్రంప్ యంత్రాంగం వైఖరిని ఆమె ప్రశ్నించారు. ట్రంప్ విధానాలు ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక విశ్వాసం, పరస్పర అవగాహనను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. అవి అమెరికాకే హాని చేస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. "అమెరికా వ్యూహాత్మక భాగస్వాములను శత్రువుల చేతిలోకి నెట్టడం ద్వారా మీకు నోబెల్ రాదు" అని ట్రంప్‌ను ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వాషింగ్టన్ మేల్కొనాలని సెల్ఫీని ఉద్దేశించి ఆమె పిలుపునిచ్చారు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. దిల్లీలోని పాలం విమానాశ్రయంలో దిగగానే రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. ఆయన్ను మోదీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరూ తమ కాన్వాయ్‌లను వదిలి, టయోటా ఫార్చ్యూనర్‌లో ప్రధాని అధికారిక నివాసం వరకు కలిసి ప్రయాణించడం చర్చనీయాంశమైంది. "ఆ కారు రైడ్ నా ఆలోచన. మా స్నేహానికి చిహ్నం. ఆ సమయంలో మేం మాట్లాడుతూనే ఉన్నాం. చర్చించుకోవడానికి ఎప్పుడూ ఏదోఒక అంశం ఉంటుంది" అని ఆ రైడ్ గురించి పుతిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే. రష్యా చమురు కొనుగోలు చేస్తోన్న భారత్‌పై అమెరికా భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. అమెరికా వ్యవహార శైలి.. భారత్‌ను రష్యా వైపునకు నెట్టివేస్తోందని సిడ్నీ విమర్శించారు.

**ట్రంప్ విధానాలపై అసంతృప్తి..**

టారిఫ్‌ల వల్ల అమెరికా, భారత ప్రజలు సవాళ్లు ఎదుర్కొంటున్నారని చట్టసభ సభ్యురాలు ప్రమీలా జయపాల్ పేర్కొన్నారు. అవి భారత ఆర్థిక వ్యవస్థను, అమెరికా వ్యాపారాలను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. భారత్-అమెరికా సంబంధాలపై అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ అమెరికా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధ్రువ జైశంకర్ మాట్లాడారు. పాకిస్థాన్ సైనిక నాయకత్వంపై ట్రంప్ యంత్రాంగం చూపుతోన్న అభిమానాన్ని ఆయన ప్రశ్నించారు. భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగుమతి చేసే పాక్‌తో ఇలాంటి సంబంధాలను ఆయన వ్యతిరేకించారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని మరో చట్టసభ సభ్యుడు బిల్ హుయిజెంగా అన్నారు. స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ పరిరక్షణకు భారత్ అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ రెండు దేశాల సంబంధాలు వ్యాపారపరమైనవి కావన్నారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై హౌస్ ఫారిన్ అఫైర్స్ సౌత్ అండ్ సెంట్రల్ ఏషి.

# అఫ్గాన్‌పై పాక్ దాడులను ఖండిస్తున్నాం : భారత్

'ఐక్యరాజ్య సమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను భారత్ గౌరవిస్తుంది. అమాయకులైన పౌరుల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. చాలా ఏళ్లుగా బలహీన పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజలపై ఇలాంటి దాడులు చేయడం సరికాదు. క్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న అఫ్గాన్‌పై బహిరంగ బెదిరింపులు, యుద్ధచర్యలు వంటివి అంతర్జాతీయ చట్టాన్ని స్పష్టంగా ఉల్లంఘించడమే. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని అన్నారు. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను తాము సమర్థిస్తున్నామని ఉద్ఘాటించారు. అక్కడి భద్రతా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా, లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ వంటి ఉగ్ర సంస్థలు సరిహద్దు ఉగ్రవాదంలో పాల్గొనకుండా చేయాలని పిలుపునిచ్చారు. అఫ్గాన్ ప్రభుత్వంతో సంబంధాలు పెంచుకోవడంపై భారత వైఖరిని ఉద్ఘాటించారు.

# మీ కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండండి..

పేర్లు తొలగింపునకు గురైతే కిచెన్ టూల్స్‌తో సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యలు చేశారు. "ఎస్ఐఆర్ పేరుతో మీ తల్లులు, సోదరీమణుల ఓట్లను లాక్కుంటారా..? ఎన్నికల సమయంలో దిల్లీ నుంచి పోలీసులను తీసుకువచ్చి మిమ్మల్ని బెదిరిస్తారు. జాబితాలో మీ పేరు లేకపోతే..మీ వద్ద వంటగదిలో వాడే పరికరాలు ఉన్నాయికదా..! వంటచేసేటప్పుడు వాడే ఆ పరికరాలు మీ బలం. మహిళలు ముందుండి పోరాడుతారు. మగవారు వారివెనక ఉంటారు. మహిళలా లేక భాజపానా..? ఎవరు బలవంతులో చూడాలని అనుకుంటున్నాను. నేను లౌకికవాదాన్నే నమ్ముతాను. ఇక్కడి ప్రజలను విభజించేందుకు ఎన్నికల సమయంలో భాజపా డబ్బు వాడి, వేరే రాష్ట్రాల నుంచి మనుషుల్ని దింపుతుంటుంది. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాశ్ చంద్రబోస్ వంటివారు ఏనాడు ప్రజలను విభజించేలా వ్యవహరించలేదు. మరి మీరంతా ఎవరు..? భారత స్వాతంత్ర్యం కోసం బెంగాల్ ప్రజలు ప్రాణాలు త్యాగం చేశారు. ఇప్పుడు భారత పౌరులుగా నిరూపించుకోవాలి" అని కృష్ణానగర్ ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో దీదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. ఈసీ 'భాజపా కమిషన్'గా మారిందని, దిల్లీ నుంచి వచ్చిన సూచనల ప్రకారం నడుచుకుంటోందని ఆరోపణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలో భాజపా ఎంపీలకు ఇటీవల ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హత లేని వారిని తొలగించడమే దాని ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఆదేశించారు.

# పెట్టుబడులకు సహకరించండి

కపిధ్వజ ప్రతాప్ సింగ్, కెనడా-ఇండియా బిజి నెస్ కౌన్సిల్ పతినిధులతో మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ భారత్‌లో పారిశ్రా మిక పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు అత్యంత అనుకూలమైన ప్రదేశం. అనుభవజ్ఞుడైన విజనరీ ముఖ్య మంత్రి చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలతో ఎపి వేగవంతంగా అభివృద్ధి సాధిస్తోంది. ఎపిలో పెట్టుబడులకు ముందుకువచ్చే పారిశ్రామికవేత్తలకు సింగిల్ విండో విధానంలో కేవలం 21రోజుల్లో అన్ని అనుమతులు ఇస్తున్నాం. రాష్ట్రంలో అనుసరిస్తున్న ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాల వల్ల కేవలం 18నెలల్లోనే రూ.23.5లక్షల కోట్ల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ కు వచ్చాయి. రాబోయే రోజుల్లో మరిన్ని గ్లోబల్ సంస్థలు రాబోతున్నాయి. ఎపిలో పారిశ్రామికాభివృద్ధికి మీంతు సహకారం అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు. టొరంటో కాన్సులేట్ జనరల్ కపిధ్వజ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ... గత ఏడాది భారత్ - కెనడా నడుమ వాణిజ్యం విలువ రూ.30.9 బిలియన్ డాలర్లకు చేరుంది, ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతమవుతున్నాయి. రాబోయే రోజుల్లో ఇరుదేశాల నడు ప్రాధాన్యతారంగాల్లో సహకారం మరింతగా పెరిగే అవకాశముంది. భారతదేశపు విధాన లక్ష్యాలకు అనుగుణంగా కెనడా వాణిజ్యాన్ని కేంద్రీకరించింది. ప్రధానంగా వ్యవసాయం, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులు, ఆహారం, సప్లయ్ చైన్ మేనేజ్ మెంట్, క్లీన్ టెక్నాలజీ, పునరుత్పాదక శక్తి (జీవశక్తి, గాలి, నీరు, సౌరశక్తి) రంగాల్లో కెనడా దృష్టిసారించింది. డిజిటల్ పరిశ్రమలు/ కృత్రిమ మేధస్సు/ ఐఒటి, మౌలిక వసతులు, రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, పోర్టులు, ఆనకట్టలు, ఇతర రంగాలపై కెనడా ఆసక్తిగకా ఉన్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామికాభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని ప్రతాప్ సింగ్ చెప్పారు.

# భాజపా దీటుగా కౌంటర్ ఇవ్వాలి : ప్రధాని మోదీ

మోదీ కితాబిచ్చి నట్లు సమాచారం. వైకాపా అధ్యక్షుడు జగన్, ఆయన పార్టీ సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలకు భాజపా కూడా దీటుగా కౌంటర్ ఇవ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారు.

**తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం!**

"తెలంగాణలో ప్రతిపక్ష పాత్ర కూడా పోషించడం లేదు. మంచి టీమ్‌ని పెట్టుకుని సమర్థంగా ఎదుర్కోవడానికి సమస్యేంటి? రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్ పెరగడానికి మంచి అవకాశం ఉన్నా దాన్ని ఉపయోగించుకోవడంలో విఫలమవుతున్నారు" అని మోదీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జాతీయ పరిణామాలపై తెలుగు ఎంపీలు యాక్టివ్‌గా ఉండాలని, పలు రాష్ట్రాల్లో పర్యటించి ఆయా అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు.

# రాయచోటిలో పంచాయితీ రాజ్ రోడ్లకు మహర్దశ

ధన్యవాదాలు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో మొత్తం 38.08 కిమీ మేరకు 12 గ్రామీణ రహదారులకు రూ.21.16 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ మంజూరు చేసింది. రహదారుల మంజూరుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అమరావతిలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ని హోం మంత్రి అనితతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ రోడ్ల నిర్మాణం ద్వారా రాయచోటిలో గ్రామీణ రవాణా సౌకర్యాలు, అభివృద్ధికి కొత్త ఊపు తీసుకురానుంది అని మంత్రి తెలిపారు.

## మాచర్ల కోర్టులో లొంగిపోయిన

# పిన్నెల్లి సోదరులు

మే 24న హత్యకు గురయ్యారు. గ్రామంలో ఆధిపత్య పోరును తమకు అనుకూలంగా మలచుకొని జంట హత్యలకు పరోక్షంగా సహకరించారని పోలీసులు పిన్నెల్లి సోదరులను ఏ6, ఏ7గా చేర్చి కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కింది కోర్టు, హైకోర్టు రద్దు చేయగా.. సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. అక్కడ కూడా బెయిల్ పిటిషన్ రద్దయింది. రెండు వారాల్లో లొంగిపోవాలని గత వారం సుప్రీంకోర్టు సూచించింది. దీంతో పిన్నెల్లి సోదరులిద్దరూ నేడు కోర్టులో లొంగిపోయారు.

# కళ్యాణదుర్గం మున్సిపాలిటీ తెదేపా కైవసం

తెదేపా నుంచి 11 మంది హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఎక్స్అఫీషియో సభ్యులు కీలకంగా మారారు. ఎక్స్అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే సురేంద్రబాబు గౌతమికి మద్దతు ఇచ్చారు. దీంతో 13 మంది మద్దతుతో ఆమె ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

**మాచవరం ఎంపీపీ పదవినీ..**

మరోవైపు పల్నాడు జిల్లా మాచవరం ఎంపీపీ పదవిని తెదేపా కైవసం చేసుకుంది. ఎంపీపీగా పిల్లుట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ కొక్కెర అంజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు గెలుపొందగా.. ఒకరు చనిపోయారు. మిగిలిన 14 మందిలో 11 మంది నేటి సమావేశానికి హాజరయ్యారు. వీరిలో ఆరుగురు తెదేపా అభ్యర్థికి మద్దతు ఇవ్వడంతో ఎంపీపీగా అంజమ్మ ఎన్నికయ్యారు.

# అమిత్ షా ఆందోళనగా కనిపించారు..

కనిపించారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకు కూడా నేరుగా సమాధానం చెప్పలేదు. అలాగే వేటికీ ఆధారం చూపించలేదు. మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలన్నింటిని పార్లమెంట్‌లో చర్చిద్దామని ఆయనకు సవాలు విసిరాను. కానీ ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు" అని రాహుల్ అన్నారు. బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా 90 నిమిషాల పాటు మాట్లాడారు. విపక్షనేత రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణల్ని తోసిపుచ్చారు. ఓటు చోరీకి పాల్పడిన పార్టీ కాంగ్రెస్ అని, ఎన్నికల్లో ఆ పార్టీ ఓటమికి కారణం నాయకత్వ లోపమేనని దుయ్యబట్టారు. చరిత్ర గురించి తాము మాట్లాడితే కాంగ్రెస్‌కి కోపం వచ్చేస్తుందని, చరిత్రే లేకుండా ఏ సమాజమైనా ఎలా ముందుకువెళ్తుందని ప్రశ్నించారు.

**రాహుల్ హిట్ అండ్ రన్ ఫార్ములా..**

పార్లమెంట్‌లో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతున్నప్పుడల్లా రాహుల్ బయటకు వెళ్లిపోతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. రాహుల్ గాంధీ హిట్ అండ్ రన్ ఫార్ములాను అనుసరిస్తున్నారని, ఇదేనా ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యమంటే..? అని ప్రశ్నించారు. భవిష్యత్తులో అయినా ఆయన ఆ అలవాటును మానేస్తారని అనుకుంటున్నానని చెప్పారు.

# బీటెక్ విద్యార్థి దారుణ హత్య

అలియాస్ శివ(19) మేడ్చల్ జిల్లా మైసమ్మగూడెంలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కుద్బుల్లాపూర్‌లో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమీన్‌పూర్ పట్టణం బీరంగూడ సృజనలక్ష్మీనగర్‌లో ఉండే యువతి, శ్రవణ్ సాయి ఇద్దరూ కూకట్‌పల్లి ప్రగతినగర్‌లోని పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. అప్పటి స్నేహం తర్వాతి కాలంలో ప్రేమగా మారింది. ప్రస్తుతం ఇద్దరూ వేర్వేరు కళాశాలల్లో చదువుకుంటున్నప్పటికీ తరచూ కలుసుకునేవారు. ప్రేమ వ్యవహారం పెద్దలకు తెలియడంతో గతంలోనే ఇరు కుటుంబాలు.. వారిని హెచ్చరించాయి. 'మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో శ్రవణ్‌సాయి, యువతి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో గొడవ జరిగింది. ఈ ఘర్షణలో యువతి చేయి విరగడంతో అదే రోజు సాయంత్రం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోంది. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరిన శ్రవణ్ సాయిని కూడా యువతి కుటుంబ సభ్యులే బుధవారం తెల్లవారుజామున నిజాంపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు' అని సీఐ నరేశ్ తెలిపారు.

**తల్లిదండ్రులు లేరు...పెదనాన్న సంరక్షణలో..**

పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన అశోక్, కోమలి దంపతుల ఏకైక కుమారుడు శ్రవణ్ సాయి. చిన్నతనంలోనే తల్లి బలవన్మరణానికి పాల్పడగా..కొన్నేళ్లకు అనారోగ్యంతో తండ్రి కూడా మృతి చెందారు. ఈ పరిస్థితుల్లో నాయనమ్మ వసంత, పెద్దనాన్న వెంకటేశ్వరరావు సంరక్షణలో ఉంటూ చదువుకుంటున్నాడు.'పెళ్లి గురించి మాట్లాడదామంటూ యువతి తల్లి.. శ్రవణ్ సాయిని ఇంటికి పిలిచింది. అనంతరం ఆమె, కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఇంట్లో బంధించి..విచక్షణ రహితంగా కొట్టారు. హింసించడం వల్లనే మా బిడ్డ చనిపోయాడు' అని వెంకటేశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

# అధికార భాషా సంఘం పని చేస్తుంది..

స్థానిక పున్నమి ఘాట్‌లోని హరిత బెర్మ్ పార్క్ సమావేశ మందిరంలో పదవీ బాధ్యతల స్వీకరోత్సవ కార్యక్రమానికి పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ పి. త్రివిక్రమరావు మాట్లాడుతూ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విచ్చేసినటువంటి పెద్దలు, మిత్రులు, ఆత్మీయులు అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చైర్మన్ గా తనను నియమించడం మర్చిపోలేనన్నారు. అదేవిధంగా నా నియామకానికి తోడ్పడిన వారిలో మంత్రి నారా లోకేష్, కూటమి నాయకులు ఉన్నారన్నారు. తెలుగు భాషా సంఘానికి చైర్మన్ గా రావడం అనేటువంటిది కత్తిమీద సాము లాంటిదని, ఎందుకంటే ఇతర భాషల ప్రభావం తెలుగుపై ఎక్కువగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో తెలుగు భాషని కాపాడుకుంటూ, తెలుగు భాషను సంరక్షించడంతోపాటు ముఖ్యంగా ప్రభుత్వ యంత్రాంగంలో తెలుగు భాష ఉపయోగాన్ని పెంచడంవంటి కార్యక్రమాలపై అందరి సలహాలు సూచనలు తీసుకుని ముందుకు వెళ్లతానన్నారు. నాకు తొలి నుంచి తెలుగు భాష, సంస్కృతి పట్ల, తెలుగు పత్రికా రంగం పై అనురక్తితో అభిమానంతో నేను పత్రికా రంగానికి వచ్చానన్నారు. అనుకోని పరిస్థితుల్లో పత్రికా రంగం నుంచి రాజకీయ రంగం వైపు రావడం తనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పరిచయం క్రమంగా అనుబంధంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురించి ఎంత చెప్పినా తక్కువేనని, ఇటీవల మహా స్వాప్నికుడు చంద్రబాబు అనే పుస్తకం రాయడం జరిగిందని, అది తన మనస్సు అంతరాళం నుంచి వచ్చిందన్నారు. నేను చూసిన వాళ్లలో అంత ఓపిక అంత సహనం ఉన్న వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. ముఖ్యమంత్రితో ఆయనకున్న జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగు భాషాభివృద్ధికి రెండు ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మొదటిది ప్రముఖ తెలుగు పండితుడు, ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా నిర్వహించి తెలుగు భాషకు ప్రత్యేకమైన స్థానం తీసుకువచ్చిన మండలి వెంకట కృష్ణారావు పేరుతో అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయడం అనేది తెలుగు భాష పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. రెండవది అధికార భాషా సంఘాన్ని ప్రజల మధ్యలోకి తీసుకువెళ్లి భాషా ఔన్నత్యాన్ని పెంపొందించగల వ్యక్తిగా, విలువలతో కూడిన సుదీర్ఘ పాత్రికేయ సేవలు అందించిన తివిక్రమరావు (విక్రమ్ పూల) ను అధ్యక్షుడిగా నియమించడం ముఖ్యమంత్రి తీసుకున్న దూరదృష్టికి నిదర్శనమన్నారు. మూడు, నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగంలో తివిక్రమరావు తనదైన ముద్ర వేసుకుంటూ విశ్లేషకుడిగా అంకిత భావంతో సేవలందించారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే "మహా స్వాప్నికుడు" గ్రంథం, అలాగే "1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం - సజీవ చరిత్ర" వంటి రచనలు ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఇటీవల నియమిస్తున్న పలు అకాడమీ, సంస్థల చైర్మన్ పదవులు కూడా సంబంధిత రంగాల్లో సేవలు అందించిన ప్రతిభావంతులకే దక్కడం, కళా%-%సాంస్కృతిక అభివృద్ధిపై ప్రభుత్వ దృక్పథాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. అదే తరహాలో అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా నియమించడం తెలుగు భాషా మహిమాన్వితాన్ని దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా వ్యాప్తి చేసే దిశగా కీలకంగా నిలుస్తుందన్నారు. తెలుగు మాతృభాషాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న త్రి భాషా విధానం, ప్రాథమిక విద్యలో తెలుగుకు ప్రధాన స్థానం కల్పించడం వంటి చర్యలు కూడా విక్రమ్ నాయకత్వంలో అధికార భాషా సంఘం పనితీరుకు మరింత బలం చేకూరుస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. తెలుగు భాషను నిలబెట్టడం, ప్రోత్సహించడం, చిన్నతరానికి భాష పట్ల అభిరుచి కలిగించడం, సాంస్కృతిక విలువలను తరతరాలకు అందించడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి భాషా-సాంస్కృతిక రంగానికి అందిస్తున్న మార్గదర్శకత్వం ప్రేరణగా నిలుస్తుందన్నారు. నూతన చైర్మన్ నియామకం తెలుగు భాషకు నూతన దిశలో కొత్త శక్తిని అందిస్తుందని అధ్యక్షుడికి హృదయ పూర్వక శు భాకాంక్షలు మంత్రి కందుల దుర్గేష్ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, 20 సూత్రాల కార్యక్రమం అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షిబ్లీ, మాజీ శాసనమండలి సభ్యులు టీడీ జనార్ధన్, సీనియర్ నాయకులు నన్నపనేని రాజకుమారి, వాసిరెడ్డి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో హస్త కళలకు మరింత ప్రోత్సాహం

అవార్డులు అందుకోవడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఈ అవార్డులు ఏపీకి వరించాయన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ హస్త కళల వారోత్సవాలు (డిసెంబర్ 8%-%14) సందర్భంగా భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ 2023, 2024కు సంవత్సరాలకు సంబంధించి అవార్డులు ప్రకటించిందన్నారు. ఏపీకి 2023 సంవత్సరానికి రెండు అవార్డులు, 2024 సంవత్సరానికి ఒక అవార్డుతో పాటు రెండు ప్రత్యేక ప్రస్తావన అవార్డులు లభించాయన్నారు. 2023కు సంబంధించి, మహిళల విభాగంలో శ్రీ కృష్ణ చరిత తోలు బొమ్మల తయారీలో డి.శివమ్మకు శిల్ప గురు అవార్డు లభించిందన్నారు. కలంకారి హ్యాండ్ పెయింటింగ్‌లో విజయలక్ష్మికి జాతీయ హస్తకళ అవార్డు వరించిందన్నారు. 2024కు సంబంధించి ఏటికొప్పాక బొమ్మల తయారీలో గోర్సా సంతోష్ కు జాతీయ అవార్డు, తోలు బొమ్మల తయారీలో కందాయ్ అంజన్నప్పకు, క్రాఫ్ట్ లో తోలుబొమ్మల తయారీ విభాగంలో ఖండే హరనాథ్ కు ప్రత్యేక ప్రస్తావన అవార్డులు వరించాయన్నారు. అవార్డు గ్రహీతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారన్నారు. రాష్ట్రంలో హస్త కళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితంగానే అవార్డులు వరించాయన్నారు. కళాకారుల సంక్షేమంతో పాటు హస్తకళా రంగాన్ని కూటమి ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తోందన్నారు. కళాకారులకు శిక్షణతో పాటు ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందన్నారు. హస్త కళాకారులకు ఆర్థిక భరోసాతో కూడిన గౌరవ ప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. హస్త కళల రంగానికి విశేష ప్రోత్సాహమందిస్తున్న సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. అవార్డులు అందుకున్న కళాకారులకు మంత్రి సవిత అభినందనలు తెలిపారు. జాతీయ అవార్డులు అందిన స్ఫూర్తితో హస్త కళలకు మరింత ప్రాచుర్యం కల్పించేలా కృషి చేస్తామన్నారు.

13న అవార్డు గ్రహీతలకు సన్మానం

అవార్డు గ్రహీతలకు ఈ నెల 13న శ్రీకాళహస్తిలో సన్మానించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. జాతీయ హస్త కళల వారోత్సవాల్లో భాగంగా ఈ సన్మానం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇదే కార్యక్రమంలో వంద మంది హస్త కళాకారులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల విలువ చేసే టూల్ కిట్లు పంపిణీ చేయనున్నట్లు ఆ ప్రకటనలో మంత్రి సవిత వెల్లడించారు.

# ఆధునిక పరిశోధనల కేంద్రంగా అమరావతి క్వాంటం వ్యాలీ

ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులోకి తేవాల్సి ఉందని అన్నారు. అమరావతిలో త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని సీఎం వెల్లడించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు ఈ క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాయని వారికి వివరించారు. నేషనల్ క్వాంటం మిషన్ కార్యక్రమాన్ని అందిపుచ్చుకుని క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తుంటే మొత్తంగా క్వాంటం ఎకో సిస్టం అమరావతికి వస్తోందని సీఎం అన్నారు. గతంలో అందిపుచ్చుకున్న ఐటీ, జీనోమ్ వ్యాలీ లాంటి వ్యవస్థలు ఇప్పుడు విజయగాథలుగా మారాయని సీఎం వ్యాఖ్యానించారు. ఇప్పుడు క్వాంటం గురించి అంతా ఆలోచిస్తున్న సమయంలో ఆ రంగంలో పనిచేయడానికి ఔత్సాహిక కంపెనీలు ఏపీని సంప్రదిస్తున్నాయని అన్నారు. అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం కంప్యూటర్ కేంద్రం ద్వారా పరిశోధనలు చేసి ఔషధాలు, మెటీరియల్ సైన్స్ సహా వివిధ అంశాల్లో వినూత్న ఆవిష్కరణలు తీసుకురావాలని స్పష్టం చేశారు. క్వాంటం బయోఫౌండ్రీ అనేది వినూత్న ఆలోచన అని ముఖ్యమంత్రి అన్నారు. బయోమెడికల్ రీసెర్చితో పాటు వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ, రవాణా సహా వేర్వేరు రంగాల్లోని భాగస్వాములు క్వాంటం వ్యాలీ సేవలను వినియోగించుకునేలా ఎకోసిస్టం అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు. ఐఐటీలు, విశ్వవిద్యాలయాలు, రీసెర్చి సంస్థలకు ఏక్యూసీసీ కేంద్రంగా అవుతుందని తెలిపారు. రూ.200 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ క్వాంటం బయోఫౌండ్రీ ద్వారా మాలిక్యులర్ మోడలింగ్, డ్రగ్ డిస్కవరీ సిమ్యులేషన్స్, మెటిరియల్ సైన్స్ పై పరిశోధనలు చేయనున్నట్టు విద్యావేత్తలు, పరిశోధకుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించింది. క్వాంటం వ్యాలీతో పాటు, ఏపీలో అమలవుతున్న విధానాలను తమను ఆకర్షించాయని గ్లోబల్ క్వాంటం బయోఫౌండ్రీ ప్రతినిధులు సీఎంకు తెలిపారు.

### విభిన్న ప్రతిభావంతులను

## ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు

**విభిన్న ప్రతిభావంతులను గుర్తించడంలో ఐఈఆర్‌పీ కీలకం**

**డీఈవో నాగేశ్వరరావు, ఏపీసీ మమ్మీలు**



**ముమ్మిడివరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విభిన్న ప్రతిభావంతులను విద్యతో పాటుగా క్రీడల్లోనూ ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏపీసీ జి.మమ్మీలు పిలుపునిచ్చారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సహిత విద్యా జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో నాగేశ్వరరావు, ఏపీసీ మమ్మీలు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను వెలికి తీయాల్సిన బాధ్యత ముఖ్యంగా ఐఈఆర్‌పీ లపై ఉందన్నారు. జిల్లాలో 22 భవిత కేంద్రాల పరిధిలో సహిత విద్య ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందుతున్న సేవలను మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి సమగ్ర శిక్షా ఎఫ్ఏఓ రంగారావు, డీవైఈవో జి.సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎంఏకే భీమారావు, జావలిన్ సెక్టార్ పారా స్పోర్ట్స్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె.ఈశ్వరరావు తదితరులు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల ప్రతిభను వివరించారు. అనంతరం ప్రత్యేక అవసరాల చిన్నారుల క్రీడా ప్రాంగణాలను డీఈవో నాగేశ్వరరావు, ఏపీసీ మమ్మీ, ఎఫ్ఏవో రంగారావు తదితరులు ప్రారంభించారు. అనంతరం సహిత విద్యా ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మానేపల్లి పుట్టిన రోజు



**శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నేత నల్లా పవన్**

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా పుట్టిన రోజు వేడుకలు రాజోలు లో ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, వేమా నివాసానికి వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి, ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకరమెల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ మాలే శ్రీనివాస్ నగేశ్, జిల్లా కార్యదర్శి రమా వర్మ, ఈబీ స్వామి, సాద్విక్, చిట్టినీడి రంగసాయి, పసుపులేటి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గోదావరి డెల్టా ప్రాంతంలో

## రోడ్లు, వంతెనలు అభివృద్ధి చేయండి



**లోక్ సభలో ఎంపీ హరీష్ బాలయోగి**

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గోదావరి డెల్టా ప్రాంతంలో కీలక రహదారులు, వంతెనలు అభివృద్ధి చేయాలని లోకసభలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి కోరారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని అనేక గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయని, తీర ప్రాంతాలు కూడా ఉన్నాయని వీటిలో మత్స్యకారులు అధికంగా ఉన్నారని తెలిపారు. ఈ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు చిన్న చిన్న రహదారులు, ఇరుకైన వంతెనలే ఆధారమని చెప్పారు. అయితే ప్రస్తుత రవాణా అవసరాలకు, విపత్తు సమయంలో సహాయక చర్యల అవసరాలకు ప్రస్తుతం ఉన్న చిన్న రహదారుల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. తీర ప్రాంతాల్లో తరచూ సంభవించే తుఫానులు, వరదలు సమయంలో ఈ రహదారులే కీలకమని వివరించారు. ప్రస్తుతం ఉన్న ఇరుకు వంతెనలు, రోడ్లు లోనే ట్రాఫిక్, అత్యవసర వాహనాల రాకపోకలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రమాద ప్రాంతాల నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, అంబులెన్స్ లు రాకపోకలకు, సహాయ బృందాల సామాగ్రి తరలించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లాలో ప్రస్తుతం అత్యవసరంగా కాట్రేనికోన మండలంలోని పల్లం గ్రామాన్ని ప్రధాన భూభాగంతో కలిపే నీళ్లరేవు వంతెన, రహదారి, అలాగే ఐ పోలవరం మండలం జి మూలపొలం-పల్లంకుర్రు గ్రామాల మధ్య వంతెన, రహదారి, గుత్తెనదీవి, గోగుల్లంక గ్రామాలను కలిపే వంతెన, రహదారి నిర్మాణం, అదేవిధంగా ఐ పోలవరం లో ఉన్న పి ఐ పి కాలువ గట్టు రోడ్డు నిర్మాణం చేసేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ గ్రామాల్లో నివాసాలు ఉంటున్న ప్రజల భద్రతకు మరియు రాకపోకలకు కీలకమైనవని ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన కింద ఈ వంతెనలు, రహదారులు బలోపేతం చేసి స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే వేగుళ్ళ పరామర్శలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం, కపిలేశ్వరపురం మండలంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. మండపేట పట్టణం విజయలక్ష్మినగర్ లో ఇటీవల మరణించిన బలవరెడ్డి రమేష్ కుటుంబ సభ్యులను, 22వ వార్డులో సబ్బెళ్ళ పార్వతి కుటుంబ సభ్యులను, కపిలేశ్వరపురం మండలం మాచర గ్రామంలో ఇటీవల మరణించిన గుడాల వెంకటరమణరావు కుటుంబ సభ్యులను, అంకిరెడ్డి సత్యవతి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శలలో ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, చిరుకూరి బాపిరాజు, పాలచర్ల రాంబాబు, శెట్టి రవి, తీగిరెడ్డి ప్రశాంత్, గుడాల జయబాబు, గొడవర్తి సత్యనారాయణ, అడపా రామకృష్ణారావు, గుర్రాల సత్య తారకృష్ణ, కరెడ్ల సురేష్, అడపా సత్తిబాబు, తదితర్లు ఉన్నారు.

## మళ్లీ వైసీపీ కైవసం చేసుకున్న కపిలేశ్వరపురం ఎంపీపీ

**ఏకగ్రీవంగా జుత్తుక వెంకటలక్ష్మీ ఎంపిక**



**కపిలేశ్వరపురం మండలం, విశ్వంవాయిస్ న్యూస్ :** కపిలేశ్వరపురం మండలం ఎంపీపీగా మేడిశెట్టి సత్యవేణి రాజీనామాతో మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు డివిజన్ డెవలప్మెంట్ అధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.నిశాంతి హాజరయ్యారు. ఈ ఎన్నికలో మొత్తం 19 మంది సభ్యులు కాగా 12 మంది వైకాపా ఎంపీటీసీలు హాజరైనారు తక్కిన సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోఎన్నిక సజావుగా సాగి ఏకగ్రీవంగా తాతపూడి గ్రామానికి చెందిన జుత్తుక వెంకటలక్ష్మీ ఎంపీపీ గా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంతో వెంకటలక్ష్మితో ప్రమాణస్వీకారం చేయించారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ఎంపీటీసీలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. మండలం అభివృద్ధి దిశగా పయనించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

### కాకినాడ జిజిహెచ్‌లో

# కార్డియాలజిస్ట్ నియామకానికి సీఎం హామీ

**రోగులకు తీరనున్న "హృదయ" కష్టాలు - జిజిహెచ్ సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన మంత్రి సుభాష్**



**కాకినాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి హృదయ వైద్యం కోసం వచ్చే రోగులకు మేలు కలగనుంది. ఉభయ గోదావరి జిల్లాల ప్రజల ఆరోగ్య ప్రదాయిని కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో కార్డియాలజిస్ట్ నియామకానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కాకినాడ జిజిహెచ్ లో వైద్యుల కొరత సమస్యపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. నాలుగు రోజుల క్రితం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి కు ఆసుపత్రిలో ఉన్న వైద్యుల కొరతను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ లావణ్య కుమారి మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గుండె ఆరోగ్యానికి సంబంధించి వైద్యులు లేకపోవడంతో హృదయ సంబంధ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రస్తుతం గుండె వ్యాధుల ఓపి కూడా జనరల్ మెడిసిన్ వైద్యులే పర్యవేక్షిస్తున్నారని, జిజిహెచ్ లో కార్డియాలజిస్ట్ నియమకానికి కృషి చేయాలని మంత్రి సుభాష్ కు విన్నవించిన సంగతి తెలిసిందే. అమరావతిలో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుభాష్ సీఎం చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వైద్యుల కొరత విషయమై సీఎం దృష్టికి తీసుకువచ్చారు. జిజిహెచ్ లో గుండె వైద్య నిపుణులు లేక గుండె జబ్బులతో వచ్చే పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. ఇప్పటివరకు కార్డియాలజిస్ట్ గా పనిచేసిన వైద్యురాలు కొన్ని అనివార్య కారణాలవల్ల రాజీనామా చేశారని, అప్పటినుంచి కార్డియాలజీ పేషెంట్లకు జనరల్ మెడిసిన్ వైద్యులే వైద్యం అందిస్తున్నారన్నారు. కరోనా తర్వాత ఎక్కువగా గుండె జబ్బు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో జిజిహెచ్ కు కార్డియాలజిస్ట్ ను నియమించవలసిన ఆవశ్యకత ఉందని సీఎంకు తెలిపారు. అలాగే మిగిలిన విభాగాల్లో కూడా వైద్యులు, సిబ్బంది కొరత ఉందని ఆ ఖాళీలను కూడా భర్తీ చేయాలని మంత్రి కోరారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు పరిసర ప్రాంతాల జిల్లాలు నుంచి కూడా అధిక సంఖ్యలో కాకినాడ ఆస్పత్రికి తరలి వస్తున్నందున రోగుల తాకిడి బాగా పెరిగిందన్నారు. సమస్య విన్న వెంటనే సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నాయుడు పది రోజుల్లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి కార్డియాలజిస్ట్ ను నియమిస్తామని హామీ ఇచ్చారని మంత్రి సుభాష్ వెల్లడించారు. దీంతో కాకినాడ ఆసుపత్రికి వచ్చే హృదయ సంబంధిత వ్యాధిగ్రస్తులకు స్వాంతన కలగనుంది. జి జి హెచ్ ఆసుపత్రి సమస్యలు నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో మిగిలిన ఖాళీలు కూడా త్వరలోనే భర్తీ కానున్నాయని మంత్రి సుభాష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఘనంగా మూడవరోజు

## ర్యాలీ కేశవ స్వామి పవిత్రోత్సవాలు

**స్వామివారిని దర్శించిన బీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి**



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆత్రేయపురం మండలం, ర్యాలి గ్రామం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక పవిత్రోత్సవాలు వైభవంగా జరిగింది. మూడవ పవిత్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు దంపతులు ఈవో భాగవతల వెంకటరమణమూర్తి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా చైర్మన్ అనంత కుమారికి ఆలయ అర్చకులు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారి మూలవిరాట్టును దర్శించుకుని, పవిత్రోత్సవాల భాగంగా నిర్వహించిన ప్రత్యేక కైంకర్యాలలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి ఘన స్వాగతం పలికారు. వేదపండితులు సత్కరించి,వేదఆశీర్వచనం అందించారు. పవిత్రోత్సవముల మూడవ (ఆఖరి)రోజు సందర్భంగా ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచశమోద్ధారణ, శాంతిహోమములు, పూర్ణాహుతి, పవిత్రములు సమర్పణ, శాంతి కళ్యాణం, మహాదాశీర్వచనం, నీరాజన మంత్రపుష్పములు ఘనంగా నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### నేడు ఎమ్మెల్సీ తోట సారధ్యంలో

## కోటి సంతకాల ర్యాలీ

**పార్టీ కేడర్‌కు పిలుపు...**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్,ఎమ్మెల్సీ మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో శుక్రవారం కోటి సంతకాల ర్యాలీ నిర్వహిస్తున్నారు.ఉదయం 10:30 గంటలకు మండపేట విజయలక్ష్మి నగర్ లోని వైసీపీ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీ ఆరంభం కానుంది. విజయలక్ష్మి నగర్ వైసీపీ పార్టీ ఆఫీస్, రాజారత్న వైయస్సార్ విగ్రహం, కలువపువ్వు సెంటర్ అయ్యప్పస్వామి దేవాలయం, మండపేట టోల్ గేట్ వరకు ఈ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ వైసీపీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రవేటీకరణ చేయడాన్ని అడ్డుకొనేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరణ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా మండపేట నియోజకవర్గం లో ఈ కార్యక్రమంకు పెద్ద ఎత్తున ప్రజా స్పందన లభించిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు పై వైసిపి తరపున అలుపెరగని పోరాటం చేస్తామని చెప్పారు.వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### నూతన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్‌ను కలిసిన

## ఏపీజీఈఏ కార్యవర్గ సభ్యులు..



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అపూర్వ భరత్ ను బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో ఏపీజీఈఏ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ మల్లాది జగన్నాధం, సెక్రెటరీ రాంబాబు, అసోసైట్ ప్రెసిడెంట్ మెడికల్ & హెల్త్ రాత్నంరాజు, ఖజానా శాఖ స్వామి, కమర్షియల్ టాక్స్ వైస్ ప్రెసిడెంట్స్ డా.వెంకటేశ్వర్లు, డ్వామ ఏపీడీ భాను ప్రకాష్, ఐసీడీఎస్ సూర్య ప్రభ, జాయింట్ సెక్రెటరీలు మెడికల్ & హెల్త్ చీకట్ల శ్రీనివాస్, కలెక్టర్ కార్యలయం డిప్యూటీ తహసీల్దార్ రవితేజ, తాలూకా యూనిట్ సభ్యులు జిల్లా పరిషత్ నుంచి పట్టాభి, నరేశ్, నాగలక్ష్మి హాజరయ్యారు.

## ఆక్రమణకు గురైన డీఫామ్ భూములు తిరిగి దళితులు ఇప్పించాలి...

**వ్యవసాయ కార్మిక సంగం రాష్ట్ర అధ్యక్షులు దదాల సుబ్బారావు డిమాండ్**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరి పట్నం గ్రామంలో తుమ్మలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొంతమంది దళితులు గతంలో ప్రభుత్వం ఇచ్చినటువంటి డి ఫామ్ పట్టా భూములు కొంతమంది ఆక్రమణకు గురి చేశారు. దీనిపై గురువారం తుమ్మలపల్లి గ్రామంలో కేవీపీస్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మీటింగ్ పెట్టడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులతో నాయకులు మాట్లాడటం జరిగింది. గ్రామస్తులు చెప్పిన వివరాలు ప్రకారం గతంలో ఇచ్చిన ప్రభుత్వం గ్రామం లో 12 మందికి 94 సెంట్లు చొప్పున ఇవ్వడం జరిగిందని తుమ్మలపల్లి గ్రామంలోని దళితులైన ఎలమంచిలి వెంకన్న (లేటు) చింతా వెర్రియ్య (లేటు) కొమరగిరి పట్టణంలో డి ఫామ్ పట్టా భూములు ఇవ్వడం జరిగిందని ఈ భూములు గుత్తులు సత్యనారాయణ కుమారులు నాగరాజు, దుర్గారావు ఆక్రమించుకుని అక్రమంగా అనుభవిస్తున్నారని సంఘం బృందానికి గ్రామస్తులు తెలియజేయడం జరిగింది. గతంలో అనేక మార్లు ప్రభుత్వాధికారులకి మొరపెట్టుకున్నామని మా భూములు మాకు తిరిగి ఇప్పించాలని కోరామని అయినప్పటికీ నేటికీ ప్రభుత్వం మా భూములు అప్పగించడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దదాల సుబ్బారావు మాట్లాడుతూ 9/77 చట్టం ప్రకారం దళితులు భూములు అన్యాక్రాంతమైతే తిరిగి రెవెన్యూ అధికారులు లబ్ధిదారులకి అందించి ఇవ్వాలని చట్టం చెబుతుంది, కానీ కొంతమంది అధికారులు ఈ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు, కావున ప్రభుత్వం తక్షణం వారి భూములు తిరిగి అందించాలని మరొకసారి ప్రభుత్వ అధికారులకు విన్నవించి పది రోజులు కాలం స్పందించకపోతే భూములను సంఘం ఆధ్వర్యంలో ఆక్రమించుకుని పేదలకు అప్పగిస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణం భూమిలేని పేదలకు పేదలైన దళితులకు ఆ భూములను అప్పగించాలని వారి కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టి బత్తుల తులసిరావు ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు ,చింతా వీరప్రసాద్, యలమంచిలి రమేష్, బల్ల శ్రీనివాస్, యలమంచిలి మోహన్ రావు, బల్ల నాగరాజు, చెవల సురేంద్ర, నాతి సూర్యనారాయణ మూర్తి, మాకే లోకేష్, విప్పర్తి వర ప్రసాద్, పొలమూరి శ్రీనివాస్, కుంచే రెడ్డిబాబు, కుంచే సహదేవుడు, కుంచే వర్మ, కుంచే సురేష్, కుంచే రమేష్, కాకర అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసులు అన్ని విధాలుగా రక్షణగా ఉండాలి



**ఉత్తర్వులు జరీ చేసిన జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా**

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం డి.ఎస్.పి ఆధ్వర్యంలో సత్యసాయి కళ్యాణ మండపం నందు అమలాపురం సబ్ డివిజన్ నందు ఉన్న మహిళా పోలీస్ అందరితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశం నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఉత్తర్వుల ప్రకారం డిఎస్పీ మాట్లాడుతూ మహిళా పోలీసులందరూ కూడా వారి పరిధిలో ఉండే ఒంటరిగా ఉండే ఆడవారి యొక్క రక్షణ చూసుకోవాలని,పాఠశాలకు వెళ్లే ఆడపిల్లల రక్షణ చూసుకోవాలని, ఆడపిల్లలకు మహిళలకు వారిపై జరిగే సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలని, పాఠశాలలను ఉమెన్ హాస్టల్స్ ను తరచుగా తనిఖీ చేస్తూ ఎవరైనా ఆకతాయిలు వారిని ఇబ్బంది పెడితే ఆ సమాచారంను స్థానిక ఎస్ హెచ్ ఓ ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలని, స్థానికంగా ఉండే మహిళలు ఆడపిల్లల యొక్క రక్షణ గురించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డి.ఎస్.పి సూచించినారు. ఈ సమావేశం లో అమలాపురం పట్టణ సీఐ పి వీరబాబు అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ అమలాపురం పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పిఠాపురం మహారాజా దానం చేసిన ఆస్తుల భూఆక్రమణపై

## సీఎంకి నివేదికను అందజేసిన సిటీ ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పిఠాపురం మహారాజా దానం చేసిన ఆనంద నిలయంకు చెందిన సుమారు 1000 కోట్ల ఆస్తి ఆక్రమణ మరియు ఐటీ సెజ్ అభివృద్ధి, కాకినాడ నగర అభివృద్ధి తదితర అంశాలపై గురువారం కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు గురువారం అమరావతి సచివాలయం నందు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని కలిసి పూర్తి వివరాలతో నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ విద్యా వికాసం కోసం దాతలు దానం చేసిన భూముల అన్యాక్రాంతానికి గురవుతున్నాయని, దాతల ఆశయానికి తూట్లు పొడుస్తూ వెయ్యి కోట్లు విలువైన ఆనంద నిలయం భూమిపై అక్రమార్కుల పాగా, అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి వివరించి భూ ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందని, అదే విధంగా కాకినాడ సర్పవరం నందు ఉన్న ఐటీ సెజ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందని, ఆనాడు 1998 వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమాచార సాంకేతిక విద్యని అభ్యసించిన యువత అభివృద్ధి కొరకు కాకినాడ సర్పవరం గ్రామం నందు భూమి కేటాయించి ఐటీ-సెజ్ కు అంకురార్పణ చేయడం జరిగిందని, ఐటీ-సెజ్ అభివృద్ధి కోసం 25.73 సెంటలు కేటాయంచడం జరగగా అందులో 15.14 సెంటలు అభివృద్ధి చేయగా, మిగిలిన భూమి అంటే 10.59 సెంటులు రోడ్లు మరియు సాధార్ణ సౌకర్యాల కిందకు కేటాయించడం జరిగిందని, ఇంకా అందుబాటలలో ఉన్న భూమిని స్టార్ట్ అప్ కంపెనీలకు కేటాయించి కాకినాడ ఐటి సెజ్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరడం జరిగిందని, అదే విధంగా కాకినాడ నగరం మరింత అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించి స్మార్ట్ సిటీ నిధులు కేటాయించాలని కోరడం జరిగిందని పేర్కొన్నారు.

# విశాఖకు 9 ఐటీ సంస్థలు..

## రేపు చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమాలు!




విశాఖ ఐటీ హబ్ లో శుక్రవారం సరికొత్త చరిత్ర మొదలుకానుంది. ఐటీ సెక్టార్ కు మరింత జోష్ వచ్చేలా ప్రపంచ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ తోపాటు మరో 8 సంస్థలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. విశాఖ ఐటీ హబ్ లో శుక్రవారం సరికొత్త చరిత్ర మొదలుకానుంది. ఐటీ సెక్టార్ కు మరింత జోష్ వచ్చేలా ప్రపంచ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ తోపాటు మరో 8 సంస్థలకు శంకుస్థాపనలు జరగనున్నాయి. ఇక కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయం కూడా శుక్రవారమే ప్రారంభం అవుతోంది. టీసీఎస్ కంటే ముందుగానే కాగ్నిజెంట్ ముందుగా సేవలు ప్రారంభించడం ఆసక్తి రేపుతోంది. విశాఖలో సర్వీసు సెంటర్ ప్రారంభానికి టీసీఎస్ తొలుత ఉత్సాహంగా ముందుకువచ్చింది. తాత్కాలిక కార్యాలయం ఎంపిక చేసుకుని, సేవా కేంద్రం ప్రారంభానికి సిద్ధమైంది. కానీ, అనూహ్యంగా కాగ్నిజెంట్ ముందుకు దూసుకువచ్చి టీసీఎస్ కన్నా ముందుగానే తన సర్వీసు సెంటర్ ను శుక్రవారం ప్రారంభిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ శుక్రవారం విశాఖలో 9 ఐటీ సంస్థల క్యాంపస్ ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ నేరుగా విశాఖ చేరుకుంటారు. శుక్రవారం ఉదయాన్నే విశాఖ చేరుకుంటారు. 9.30 నిమిషాలకు రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నెంబరు-2లో మహతి ఫిన్ టెక్ భవనంలో కాగ్నిజెంట్ తాత్కాలిక కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత హిల్-3లో శ్రీటెక్ సంస్థకు భూమి పూజ చేస్తారు. అక్కడే నాన్ రెల్ టెక్నాలజీస్, ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థలకు భూమిపూజ చేయనున్నారు. ఆ తర్వాత హిల్ నెంబరు 4లో సత్వాస్ వాంటేజ్ వైజాగ్ క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత కాపులుప్పాడ చేరుకుని ఇమ్మాజినోటివ్, ఫ్లూయెంట్ గ్రిడ్ ఐటీ కంపెనీలకు శంకుస్థాపన నిర్వహిస్తారు. మదర్ సన్ టెక్నాలజీస్, క్వార్ట్బ టెక్నోసాఫ్ట్ సంస్థల శిలాఫలకాలు ఆవిష్కరిస్తారు. ఇవన్నీ కేవలం గంటర్నలో పూర్తి చేయనున్నారు. ఇక ఉదయం 11 గంటలకు సీఎం చంద్రబాబుతో కలిసి కాగ్నిజెంట్ శాశ్వత కార్యాలయ పనుల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముచ్చటించనున్నారు. మొత్తానికి శుక్రవారం నిర్మాణాలు ప్రారంభించనున్న ఐటీ సంస్థలతో విశాఖకు అదనంగా 50 వేల ఉద్యోగ అవకాశాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు. కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి సంస్థలు తక్షణమే తాత్కాలిక భవనాల్లో కార్యాలయాలు ప్రారంభిస్తుండటం వల్ల మిగిలిన సంస్థలు కూడా వేగంగా తమ సేవలు ప్రారంభించాలనే ఉద్దేశంతో ముందుకొస్తున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో సత్వరమే అనుమతులు మంజూరు చేస్తుండటంతో విశాఖ ఐటీ సెజ్ కు కొత్త పరిశ్రమలు పోటాపోటీగా తరలివస్తున్నాయని అంటున్నారు.

# బోరుగడ్డతో భలే తమాషా.. ఉలిక్కిపడిన వైసీపీ!

గుంటూరుకు చెందిన రౌడిషీటర్, వైసీపీ సానుభూతిపరుడిగా చెప్పుకునే బోరుగడ్డ అనిల్ కుమారుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రకటించింది. గుంటూరుకు చెందిన వైసీపీ సానుభూతిపరుడిగా చెప్పుకునే బోరుగడ్డ అనిల్ కుమారుతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రకటించింది. అధికారంలో ఉండగా బోరుగడ్డ సోషల్ మీడియా ఇంటర్వ్యూలు, అతడి ప్రవర్తన పట్ల మౌనం వహించిన వైసీపీ పార్టీ.. తాజాగా అతడు ఓ యూట్యూబ్ చానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూతో ఉలిక్కిపడింది. బోరుగడ్డ మాటలను తేలిగ్గా వదిలేస్తే పార్టీకి తీవ్ర నష్టం తప్పదన్న భావనకు వచ్చిన వైసీపీ.. అతడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గురువారం సాయంత్రం ప్రకటించింది. అయితే వైసీపీ ప్రకటన చేయడానికి దారి తీసిన పరిస్థితులపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, తాను ఆ పార్టీకి సానుభూతిపరుడిగా బోరుగడ్డ అనిల్ కుమార్ చెప్పుకునేవాడు. రిపబ్లికన్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో, కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే శిష్యుడిగా చెప్పుకుంటూ బోరుగడ్డ రాష్ట్రంలో అనేక వ్యవహారాలు చేశాడు. అయితే అన్నింటికంటే ఎక్కువగా మాజీ సీఎం జగన్ వీరాభిమాని అనే ట్యాగ్ లైన్ తో సోషల్ మీడియాలో రెచ్చిపోయేవాడు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి ఫోన్ చేసి తన అభిమాన నేత జగన్ ను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని



బెదిరించాడు. అయితే బోరుగడ్డ అలా రెచ్చిపోయినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎన్నికల్లో ఆ పార్టీకి తీవ్ర నష్టం ఎదురైందనే విశ్లేషణలు ఉన్నాయి. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బోరుగడ్డను అరెస్టు చేశారు. దాదాపు ఏడు నెలలు జైలులో పెట్టారు. రాష్ట్రంలో దాదాపు 50 కేసలు నమోదు చేయడమే కాకుండా, రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు తిప్పుతూ బోరుగడ్డకు తగిన ట్రీట్మెంట్ ఇచ్చారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం ఆయనపై ఇంత కఠినంగా వ్యవహరించినా ఎవరూ సానుభూతి కూడా చూపలేదు. వైసీపీ నేతలు కూడా అతడికి విధించిన శిక్షపై లోలోన ఆనందించారని అంటున్నారు. తమ ప్రభుత్వం చేయలేని పనిని కూటమి ప్రభుత్వం చేసిందని పార్టీ అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానించేవారని అంటున్నారు. బోరుగడ్డ వంటి వారి వల్లే ప్రజల్లో వైసీపీపై దురాభిప్రాయం ఏర్పడిందని కూడా అంటున్నారు. ఈ నేపథ్యంలో బోరుగడ్డ ఏడు నెలలు జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చారు. తన మకం గుంటూరు నుంచి హైదరాబాద్ కు తాత్కాలికంగా మార్చారు. జైలు నుంచి విడుదలైన తర్వాత బోరుగడ్డ చాలాకాలం సైలెంటుగానే ఉన్నాడు. అయితే కొన్ని యూట్యూబ్ చానళ్లు మళ్లీ అతడిని ఇంటర్వ్యూలు చేయడంతో తాను మాజీ సీఎం జగన్ శిష్యుడినంటూ చెప్పుకోవడం ప్రారంభించాడు. అంతేకాకుండా తనకు పార్టీకి సంబంధం లేదంటూ చెబుతున్న నేతలపై తీవ్ర పదజాలంతో దూషణలు మొదలుపెట్టాడు. తనకు జగన్ అండగా నిలిచారని, ఆయనే బెయిలు ఇప్పించారని కూడా బోరుగడ్డ ఇంటర్వ్యూల్లో చెబుతున్నాడు. తాను ఇన్నాళ్లు రిపబ్లికన్ పార్టీలో కొనసాగానని, ఇప్పుడు ఆ పార్టీకి రాజీనామా చేశానని, త్వరలో జగన్ సమక్షంలో అధికారికంగా పార్టీలో చేరుతానని కూడా చెప్పాడు. దీంతో వైసీపీ ఉలిక్కిపడింది. బోరుగడ్డ మాటలను గతంలో మాదిరిగా ఉపేక్షిస్తే పార్టీకి చెడ్డపేరు ఖాయమన్న భావనతో వెనువెంటనే స్పందించింది. బోరుగడ్డ ఇంటర్వ్యూ యూట్యూబ్ లో దర్శనమిచ్చిన గంటల వ్యవధిలోనే అతడితో పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా పార్టీ నేతలపై అతడు చేసిన వ్యాఖ్యలను ఖండించింది. అయితే బోరుగడ్డకు పార్టీతో సంబంధం లేదని చేతులు దులుపుకోవడం కాదని, అతడు పార్టీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకటరెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని వైసీపీకి అనుబంధంగా పనిచేస్తున్న యూట్యూబర్లు సూచిస్తున్నారు. దీంతో బోరుగడ్డ ఎపిసోడ్ తమషాగా మారిందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## నరసరావుపేటలో "లడ్డు పల్లెం" నూతన వ్యాపారం ప్రారంభం

### ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయం రోడ్డులో "లడ్డు పల్లెం" అనే కొత్త వ్యాపార సముదాయం నూతన శాఖను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని రిబ్బన్ కత్తిరించి శుభారంభం చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తో పాటు ఉమ్మడి కూటమి నాయకులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాతృ మరణాలను నిరోధించండి : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో కాన్పు, తదనంతర మాతృ మరణాలను నిరోధించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వైద్య అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి మాతృ మరణాల పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీలపై క్షేత్ర స్థాయిలో సిబ్బంది ముందుగానే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.



రక్తంలో హీమో గ్లోబిన్ స్థాయిలు, గర్భిణీల ఆరోగ్య,ఆదాయ స్థితిగతులను బట్టి హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించాలన్నారు. జిల్లాలో చోటు చేసుకున్న ఐదు మాతృ మరణాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరారు. బాధితుల కుటుంబీకుల నుంచి అభిప్రాయాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో రవి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధి గౌతమి, డీసీహెచ్ఎస్ ప్రసూన, డీఐవో రాంబాబు, డిఎల్ఓ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో

## స్వాతి షాపింగ్ మాల్ పునఃప్రారంభం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నరసరావుపేటలోని కోట సెంటర్‌లో గల 'స్వాతి షాపింగ్ మాల్' గతంలో అగ్నిప్రమాదానికి గురైన సందర్భంలో పూర్తిగా దెబ్బతిన్న నిర్మాణాన్ని రీ-మోడలింగ్ చేసి, సరికొత్త ఆధునిక రూపంతో బుధవారం భారీ వైభవంగా పునఃప్రారంభించారు. పునఃప్రారంభోత్సవ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొని స్వాతి షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ప్రముఖ సినీ నటి అనసూయ భరద్వాజ కూడా విశిష్ట అతిథిగా హాజరై కార్యక్రమానికి మరింత ఉత్సాహం తెచ్చారు. అగ్నిప్రమాదం తర్వాత భవనాన్ని అత్యాధునిక సౌకర్యాలతో, అంత్యంత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తిరిగి నిర్మించినట్లు మాల్ యాజమాన్యం తెలిపింది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ షాపింగ్ మాల్ పట్టణ ప్రజలకు ఒకే చోట అన్ని రకాల వస్త్రాలను అందుబాటులోకి తెచ్చింది. పునప్రారంభం సందర్భంగా ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించి, జాతీయస్థాయి పోటీలకు

## ఎంపికైన కరప మండల విద్యార్థినిలు

### శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 8, 9వ తేదీలలో రాజమండ్రిలో జరిగిన ఖేలో ఇండియా ఉష ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్న కరప మండలం యండమూరు ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిలు యు.విజ్ఞశ్రీ, పి.రమ్యాదేవి గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదేవిధంగా ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఛత్తీస్గఢ్ లో జరిగే 9వ ఫెడరేషన్ సబ్ జూనియర్ ఫైట్స్ కి యు.విజ్ఞశ్రీ పి.రమ్యదేవి, పి.రమాదేవి, పి.హన్సిక, వేళంగి అక్షర స్కూల్ కి చెందిన పి.కీర్తన ఎంపికయ్యారు.ఈ నేపథ్యంలో ఈ విద్యార్థినిలు బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను కలిశారు.చిన్ననాటి నుంచి క్రీడల్లో రాణించడం అభినందనియమని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీయుపీ స్కూల్ వైస్ చైర్మన్ యూ.సరోజ కృష్ణ, ఉపాధ్యాయలు లోవరాజు, కృష్ణ, వేళంగి అక్షర స్కూల్ ప్రతినిధి టీ. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో ప్రభా ఇ జోసఫ్ పార్కుకు భద్రత, పరిశుభ్రత చర్యలు



### అదనపు కమిషనర్ సుధాకర్

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర ప్రజలకు విశ్రాంతి, ఆహ్లాదాన్ని అందించే పార్కులను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్ తెలిపారు.గురువారం ఉదయం జగన్నాధపురంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నివాసం ఎదురుగా ఉన్న ప్రభా ఇజోసఫ్ పార్కును ఆయన సందర్శించారు. పార్కుకు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆకతాయిలు రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాకర్లు అదనపు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే స్పందించిన అదనపు కమిషనర్ సుధాకర్ మాట్లాడుతూ "పార్కులను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాము. వాకర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాత్రి సమయంలో పోలీసు గస్తీ ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటామన్నారు. పార్కులో లైటింగ్, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను మెరుగుపరిచే దిశగా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. అదనపు కమిషనర్ వెంట శానిటేషన్ ఇన్స్పెక్టర్ ధర్మాజీ తదితరులు ఉన్నారు.

## కాకినాడలో ఓటర్ రికార్డుల వెరిఫికేషన్ వేగవంతం

### అధికారులకు అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ఆదేశాలు

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో ఓటర్ జాబితా పరిశీలన, సరిచూచే ప్రక్రియను వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్, ఆర్డీఓ ఎస్. మల్లిబాబులు బూత్ లెవెల్ అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో వారు



మాట్లాడారు. 2002లో నమోదైన ఓటర్ల వివరాలను 2005 రికార్డులతో స్పెషల్ ఇన్సెంటివ్ రీజన్ విధానంలో త్వరితగతిన సరిపోల్చాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ వివరాలను విశ్లేషించి ఖచ్చితమైన జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. కాకినాడ నియోజకవర్గంలో ఈ ప్రక్రియ మందగించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించిన అధికారులు, ఎస్ఐఆర్ విధానం ద్వారా ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా శుద్ధమైన ఓటర్ జాబితా సిద్ధం చేయగలమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈఆర్ఓ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ శనివారం, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ విధానం ముమ్మరం చేయాలని సూచించారు. సోమవారం జరిగే సమీక్ష సమావేశానికి ప్రతీ అధికారి పూర్తి స్థాయి నివేదికతో హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఈఆర్వోలు డిప్యూటీ తాసిల్దార్ వివిఆర్ఎస్ కృష్ణకుమారి, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ కె.గోవింద్ రాజు, ఏఎస్డబ్ల్యూఓ కే.రాధ, డిప్యూటీ సిటీ ప్లానర్ కెవి కృష్ణారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఏ.శ్రీధర్, బూత్ లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## పెద్దిపాలెంలో అగ్ని ప్రమాద బాధితులకు అండగా ముదునూరి

### నాలుగు కుటుంబాలకు రూ.35 వేలు ఆర్థిక సాయం




**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళీ కృష్ణంరాజు పరామర్శించారు.స్థానిక నాయకులు సమక్షంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన రాళ్ళ అప్పారావు, రాళ్ళ రాజు, రాళ్ళ ఆనందరావు కుటుంబాలను పరామర్శించి విచారం వ్యక్తం చేసారు. బాధిత నిరాశ్రయ కుటుంబాలకు రూ. 10 వేలు చొప్పున రూ.30 వేలు ఆర్థిక సహాయం అందించారు. పాక్షికంగా దెబ్బతిన్న కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ముదునూరి మురళీ కృష్ణంరాజు మీడియాతో మాట్లాడుతూ అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని,కనీసం సహాయం అందించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులకు పక్కా గృహాలు నిర్మించి తగు వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేకా చంటిబాబు, విత్తనాల నాగేశ్వరరావు, దేవ లక్ష్మణ్, తుట్టా జమిందార్, దేవ రాము, కొల్లుబోయిన ఏసుబాబు, ధర్మవరం ఎంపీటీసీ నాని పల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థతో

## కలిసి పనిచేయడం అభినందనీయం



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అనాథ, మానసిక దివ్యాంగుల సేవలో మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి పనిచేయడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి తెలియజేశారు. గురువారం కలెక్టరేట్ జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో మనోబంధు పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్, రెడ్‌క్రాస్ సంస్థలు సమా జంలోని అత్యంత అవసరమైన మానసిక దివ్యాంగులకు అండగా నిలిచి స్ఫూర్తి కలిగిస్తున్నాయన్నారు. మానసిక దివ్యాంగుల పునరావాసం కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ అంబులెన్స్ ద్వారా జిల్లాలో రోడ్లపై నివసిస్తున్న మానసిక దివ్యాంగులను గుర్తించి వారికి ఆహారం, వైద్యం, ఆశ్రయం వంటి సేవలు అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ ఏకా మురళి , రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ యం ఆర్ శేషగిరి రావు , మనో బందు ఫౌండేషన్ ఫీల్డ్ సూపర్వైజర్ బాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పల్నాడు జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ డాక్టర్ కృతిక శుక్లాకు మేరీకర్ట్ మెమోరియల్ సెంటినరీ టౌన్ బాప్టిస్ట్ చర్చ్ డెడికేషన్ శర్మని ఇన్విటేషన్ అందజేసి స్వయంగా చర్చి విశిష్టతను కలెక్టర్‌కు తెలియజేసిన శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఇన్విటేషన్ కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో కొట్ట కిరణ్ కుమార్, క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
VISWAMVOICE TELUGU DAILY
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్
శుక్రవారం, 12 డిసెంబర్ 2025
www.viswamvoice.com





# రామచంద్రపురం నియోజవర్గ రోడ్లకు మహర్దశ

## రోడ్ల నిర్మాణానికి రూ.22.22 కోట్లు మంజూరు - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడి

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవతో రామచంద్రపురం నియోజక వర్గంలోని పలు రోడ్లకు మోక్షం కలగనుంది. రామచంద్రపురం నియోజవర్గంలోని రామచంద్రపురం, కాజులూరు, కె. గంగవరం మండలాల్లోని 13 రోడ్లు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ద్వారా రూ. 22.22 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం పరితపిస్తున్న మంత్రి సుభాష్ ఈ నిధులు మంజూరులో కృషిచేసి సఫలీకృతులయ్యారు. గడచిన 18 నెలల కూటమి ప్రభుత్వ హయాంలో సుమారు 150 కోట్లతో నియోజవర్గాన్ని అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మంజూరైన నిధులతో కాజులూరు మండలంలో రూ. 15.97 కోట్లతో తొమ్మిది రోడ్లు, కె.గంగవరం మండలంలో రూ. 4.76 కోట్లతో మూడు రోడ్లు, రామచంద్రపురం లో ఒక రోడ్డు రూ. 1.49 కోట్లు వెరసి మొత్తం రూ.22.22 కోట్లు వెచ్చించి రోడ్లు నిర్మించనున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో గుంతల మయంగా, అధ్వానంగా తయారైన రోడ్లను కూటమి ప్రభుత్వం దప దఫాలుగా బాగు చేస్తున్న సంగతి ప్రజలకు తెలిసిందే. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రోడ్ల నిర్మాణం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఈ నిధులు మంజూరు చేశారు.



ఈ రోడ్ల నిర్మాణంతో నియోజవర్గంలో రోడ్లు దాదాపు కొత్త రూపు సంతరించుకుంటాయని భావిస్తున్నారు.

**మంజూరైన రోడ్లు ఇవే..**

కాజులూరు మండలంలో ఆంద్రంగి నుంచి దుగ్గుదూరు 6.262 కిలోమీటర్ల రోడ్డు రూ. 4.90 కోట్లు, ఆర్యవటం నుంచి వయా జగన్నాథగిరి , మామిడాడ ,తర్లంపూడి 6.262 కిలోమీటర్ల రోడ్డు రూ. 2.61 కోట్లు, తుమ్మలపల్లి లంక నుంచి ముతుకుమిల్లి వయా ఆర్యవటం బంధనపూడి 4.931కిలోమీటర్ రోడ్డు రూ. 2.51 కోట్లు, గోప్పిరావు నుంచి పల్లిపాలెం వరకు వయా నామవానిపాలెం 3.232 కిలోమీటర్ రోడ్డురూ. 1.78 కోట్లు, కోలంక టు చలివేంద్రపాడు 2.717 కిలోమీటర్ రోడ్డు రూ. 1.14 కోట్లు, కోలంక నుంచి పెదలంక 2.415 కిలోమీటర్ రోడ్డు 0.49 లక్షలు, అలాగే పల్లిపాలెం నుంచి ఎర్రగుంట పేట 1.228 కిలోమీటర్ రోడ్డు 0.68 లక్షలు, వై డి రోడ్ నుంచి పొలమూరు పాడు 0.847మీటర్ రోడ్డు రూ. 0.47 లక్షలుతో మొత్తం రూ. 15.97 కోట్లతో రోడ్లు నిర్మించనున్నారు. అలాగే రామచంద్రపురం మండలంలో కేఎన్ఎఫ్ (కాకినాడ నర్సాపురం పెర్రి రోడ్డు) నుంచి వెంకటాయపాలెం టు గణపతి నగరం 2.622 కిలోమీటర్ రూ. 1.49 కోట్లు. కె గంగవరం మండలంలో కే ఎన్ ఎఫ్ రోడ్ నుంచి సుందరపల్లి వయా కొత్తపేట 3.289 కిలోమీటర్ రోడ్డు రూ. 1.92 కోట్లు, పేకేరు నుంచి పొలమూరు పాడు హెచ్ఐవో దుగ్గుదూరు 2.686 కిలోమీటర్ రోడ్డు రూ. 1.48 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్డు నుంచి కొత్తకొంపలు వయా కుడుపూరు సావరం 2.475కిలోమీటర్ రోడ్డు రూ. 1.36 కోట్లు వెరసి మొత్తం రూ. 22.22 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడతామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ప్రజల మౌలిక సదుపాయాలైన రోడ్ల నిర్మాణం, త్రాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు వెచ్చిస్తుందని మంత్రి శుభాష్ సందర్భంగా పేర్కొన్నారు.

# నూతన సిసి రోడ్డును పరిశీలించిన కలెక్టర్

## గ్రామంలో సమస్యలు అన్ని పరిష్కరిస్తాము.. : కలెక్టర్ మహేష్ కుమార్

**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు ను అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతం అయిన ఓడలరేవు గ్రామాన్ని సీఎం చంద్రబాబు ఆకస్మికంగా వచ్చి పరిశీలించిన విషయం అందరికీ తీసిందే. అయితే గ్రామంపై దృష్టి పెట్టిన చంద్రబాబు హుటాహుటిన రోడ్లు వేయాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గురువారం గ్రామంలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించారు. జరుగుతున్న పనుల వివరాలను అన్యం రాంబాబు కలెక్టర్‌కు వివరించారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుని, నాణ్యతగా రోడ్డును వేయాలని, అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



**పలు సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ కోరిన గ్రామస్తులు..**

తుఫాన్ వలన ఇటీవలే కురిసిన వర్షాలకు వంతెన కు ఇరు ప్రక్కల ఉన్న ఎటు గట్టుకు పెద్ద పెద్ద గండ్లు పడ్డాయని, అందువలన కాలవలో నీరు గ్రామంలోకి వచ్చి ఇటు ఇల్లు, అటు వ్యవసాయ పంటలు పూర్తి గా దెబ్బ తింటున్నాయని, సాస్వత పరిష్కారం చేపట్టాలని గ్రామ సర్పంచ్ మల్లాడి మంగయ్యమ్మ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్వయంగా గండ్లు ను కూడా పరిశీలించి ఓఎన్జిసి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాను అని అన్నారు. కొంతమంది గ్రామస్తులు మాట్లాడుతూ కొత్త రోడ్డు కు ఇరుపక్కల సుమారు 1 ఎకరా 34 సెంట్లు సొంత స్థలం రోడ్డుకు ఇచ్చి నష్టపోయారని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఓఎన్జిసి అధికారులతో మాట్లాడి నష్ట పరిహారం అందించేలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ అన్యం రాంబాబు, తహసీల్దార్ నరసింహారావు, జెఈ కొండలరావు, కొల్లు విష్ణుమూర్తి, మల్లాడి ఉమామహేశ్వరరావు, కోప్పడి వెంకటరాంకృష్ణ, కలిగితి యేసు,మధుర శేఖర్, నాతి లేనిన్ బాబు,రేకాడి శేషగిరి, ఓఎన్జిసి అధికారులు, కాంట్రాక్టర్లు రామక్రిష్ణ రాంబాబు, సెక్రటరీ సాయి, విఆర్ఓ సతీష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గంలో 9 రహదారుల నిర్మాణానికి రూ.14.93 కోట్లు మంజూరు. పంచాయతీ రాజ్ నిధులతో నిర్మాణం కొత్తపేట నియోజకవర్గంలో పలు రహదారుల నిర్మాణానికి పంచాయతీరాజ్ శాఖ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు జీవో విడుదల అయ్యింది.నియోజకవర్గంలో పలు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా గతంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసిన సందర్భంలో ఎమ్మెల్యే బండారు ఆయనకు నివేదించారు. నిధులు మంజూరు చేస్తానని ఆ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఎమ్మెల్యేకు ఇచ్చిన హామీ మేరకు నేడు నిధులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ధన్యవాదాలు తెలియజేశారు.నిర్మాణం జరగనున్న రహదారుల వివరాలివి.పొడగట్లపల్లి నుంచి జానిరెడ్డివారిపాలెం వరకూ 0.821 కి.మీల రహదారి నిర్మాణానికి రూ.60లక్షలు. జాతీయరహదారి 216 గౌతమి గోదావరి నుండి వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి గుడి వరకు ఏటిగట్టు రహదారి 7.000 కి.మీలకు రూ.6కోట్లు. పలివెల నుండి పూజారిపాలెం వరకూ 2.975 కి.మీల రహదారి నిర్మాణానికి రూ.1.64కోట్లు. నక్కవారిపేట నుండి మసాయిపేట యెలిశెట్టివారిపాలెం బిళ్ళకర్రు వరకూ 2.122 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.1.4 కోట్లు. పలివెల నుంచి పెదపేట వరకూ 1.635 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.1.16కోట్లు. అమలాపురం కెనాల్ దేగలవారివారిపాలెం బ్రిడ్జ్ నుంచి శ్రీరామ్ నగర్ వరకూ 1.390 కి.మీ రహదారి నిర్మాణానికి 76లక్షలు ఆత్రేయపురం ఎస్సీ పేట నుండి ర్యాలీ పుంత మెర్లపాలెం వరకు 1.935 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.1.64 కోట్లు ఆత్రేయపురం నుంచి యూజీ పాలెం వరకూ 0.946 కి.మీ రహదారి నిర్మాణానికి రూ.52 లక్షలు, ఆలమూరు మండలం పినపళ్ళ నుండి వరహాల కాలువ రహదారి వరకూ 2.003 కి.మీల రహదారి నిర్మాణానికి రూ.1.21కోట్లు మొత్తం 9 రహదారుల నిర్మాణానికి రూ.14.93 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలియజేశారు.

### పేద విద్యార్థిని చదువుకు రమణారావు

# రూ.25 వేలు ఆర్థిక సాయం




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద విద్యార్థిని చదువు కొనసాగించేందుకు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు గురువారం ఆర్థిక సాయం అందజేసి ప్రోత్సాహాన్ని అందించారు. అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంకు చెందిన ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థిని జల్లి రమ్య ఝాన్సీ రాణి నర్సింగ్ కళాశాలలో బిఎస్‌సి నర్సింగ్ కోర్సు చదువుతుంది. చదువు కొనసాగించేందుకు రమణారావు రూ. 25 వేలు ప్రోత్సాహాన్ని అందించారు. అమలాపురం లోని గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో రమ్యకు రూ.25వేలు చెక్కును గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుంచే రమణారావు అందజేసి విద్యలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా రమ్య ఆమె తండ్రి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు చదువును ప్రోత్సహిస్తూన్న గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ రమణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు కంచర్ల జాన్సన్ , నేరేడు మిల్లి శ్రీను, పరమట రాజేష్, బాలాజీ, గణేష్,విప్పర్తి రమేష్, అంజి, నాని తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరించిన కౌన్సిలర్లు, డైరెక్టర్లు...

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీని గ్రేడ్-2 నుండి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ గా అప్ గ్రేడ్ చేయడానికి కృషి చేసి సాధించిన రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర రావును గురువారం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో మండపేట మున్సిపల్ కౌన్సిలర్లు మరియు కార్పొరేషన్ డైరెక్టర్లు కలిసి దుశ్శాలువా కప్పి, పూల బొకేలతో సత్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రేడ్-2 గా ఉన్న మండపేట మున్సిపాలిటీని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయించిన ఘనత ఎమ్మెల్యే వేగుళ్ళకు మాత్రమే చెందుతుందని, ఇది ఆయనకు మండపేట పట్టణ ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని వారు పెర్కొన్నారు. రాబోయే రోజుల్లో మండపేట పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి, నిధులు మరింత ఎక్కువ తీసుకురావడానికి దోహదపడుతుందన్నారు. అనంతరం, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే వేగుళ్ళ ఇచ్చిన హామీ ప్రకారం మండపేట నియోజకవర్గాన్ని రాజమండ్రి కేంద్రంగా గల తూర్పుగోదావరి జిల్లాలో విలీనం కొరకు ముఖ్యమంత్రిని ఒప్పించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఎమ్మెల్యే వేగుళ్ళను ప్రజలంతా అభినందిస్తున్నారని, ప్రజల ముఖ్య అవసరాలను తీరుస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ప్రజలలో చిరస్మరణీయంగా ఉంటారని ఈ సందర్భంగా వారంతా ఆనందం వ్యక్తం చేశారు.



### హిందూ దేవాలయాలపై వైసీపీ చేస్తున్న

# చౌకబారు వ్యాఖ్యలు తగవు

## కొత్తపేట మండల పార్టీ బీజేపీ అధ్యక్షులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కలియుగ దైవమైన వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పై వైయస్సార్ పార్టీ చేస్తున్న చౌక బారు వ్యాఖ్యలు తగవుని కొత్తపేట మండలం బిజెపి అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అన్నారు.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చాక దేవస్థానం దినదిన అభివృద్ధి సరవేగంగా జరుగుతుందని కొత్తపేట నియోజకవర్గంలో ఈ పుణ్యక్షేత్రం ఈ విధంగా ప్రాచుర్యం సంతరించుకోవడం శాసనసభ్యులు ప్రత్యేక నిధులు తెచ్చి రోడ్లు భవనాలు విస్తరింప చేయడం దేవస్థానం పై ప్రత్యేక దృష్టి పెట్టి అధికారులను పరుగులు పెట్టిచ్ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తుంటే... దానిని చూసి ఓర్వలేక వైయస్సార్ పార్టీ అవ్వకులు చవ్వాకులు పేలుతుందని గత ప్రభుత్వా హయాంలో దేవస్థానంలో ఏమి జరిగిందో ప్రజలందరికీ తెలుసని ఆ మచ్చను తుడుచుకోవడానికి ఇప్పుడు కూటమి నాయకులు పై అవినీతి ఆరోపణ చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా దేవస్థానం అధికారిపై దిగజారుడు ఆరోపణలు చేయడం ఆ స్థాయి నాయకులకు తగదని ఆయన ఆరోపించారు ఏది ఏమైనా వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం పై బురద జల్లి ఆలయ పవిత్రతకు దెబ్బతీయడానికి కొన్ని శక్తులు పనిచేస్తున్నాయని హిందువులు మనోభావాలు దెబ్బతీసే విధంగా అభివృద్ధి చెందుతున్న దేవాలయాలపై ఇటువంటి వ్యాఖ్యలు చేసేవారికి బిజెపి పార్టీ తగిన బుద్ధి చెబుతుందని ఆయన అన్నారు. అయినా అవినీతి జరిగితే సంబంధిత అధికారులకు ఆధారాలతో సమర్పించి అధికారులపై తగిన చర్యలు తీసుకోవడం ప్రతి భక్తుడికి అధికారం ఉందని అంతేగాని ఇలా వెంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీసే విధముగా మీడియా ముఖంగా ఆరోపణలు చేసి పవిత్రతను దెబ్బ తీసే ప్రయత్నాలు చేయడం తగదని ఆయన అన్నారు. పార్టీ పరంగా రాజకీయాలను ఎదుర్కోవాలి కానీ.ఇలా పవిత్ర దేవాలయాలను అడ్డంపెట్టుకు ఆరోపణలు చేస్తే. భగవంతుడు చూస్తూ ఊరుకోడని సంపతి కనకేశ్వరరావు కొత్తపేట మండల పార్టీ బిజెపి అధ్యక్షులు తెలియజేశారు.

# 14న లోక్‌అథాలత్ నందు కేసులు సత్వర పరిష్కారం

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** 13వ తేదీ శనివారం నేషనల్ లోక్ అదాలత్ నేషనల్ లోక్ అదాలత్ జరుగుచున్నది కొత్తపేట కోర్టు వాడపాలెం నందు సీనియర్ సివిల్ జడ్జ్ ఏ సాయి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించబడును. 14న లోక్ అథాలత్ నందు కేసులు సత్వర పరిష్కారం చేయబడును పెండింగ్లో ఉన్న కేసులు,పెట్టి కేసెస్ డ్రంక్ అండ్ డ్రైవ్ రాష్ అండ్ నెగ్లిజేషన్ సివిల్ క్రిమినల్ అండ్ కాంపౌండ్బుల్ కేసెస్ బ్యాంకు కేసులు బిఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించబడునని తెలియజేయడమైనది ఇట్లు మండల లీగల్ సర్వీస్ కమిటీ కొత్తపేట వారు తెలియజేశారు.




### అగ్నికుల క్షత్రియులకు ప్రత్యేక ఆహ్వానితులుగా

# స్థానం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్నికుల క్షత్రియుల ఆకాంక్షకు స్పందించిన సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోనసీమ తిరు వైమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలిలో అగ్నికుల క్షత్రియులకు ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన మసకపల్లి త్రిమూర్తులు ప్రత్యేక ఆహ్వానితులుగా నియమితులు. పాలకమండలిలో మత్స్యకార వర్గానికి గోసాల అప్పల నరస సభ్యునిగా నియామకం కూడా ప్రశంసనీయం.అగ్నికుల క్షత్రియుల కోరిక మేరకు పినపోతు గజేంద్రుడు విగ్రహం స్థాపనపై కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.



### హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి

# శిల్పి డి.రాజకుమార్ వడయార్

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి కొత్తపేట మండల సమావేశం ఆచార్య శిల్పి డీ.రాజ్ కుమార్ వడయర్ నివాసంలో జరిగింది. వడయార్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా హిందూ బంధువులు ను అందరిని ఏకం చేస్తూ తలపెట్టిన కార్యక్రమం హిందూ సమ్మేళనం అని ఈ సభను డిశంబర్ 25 వ తేదీన కొత్తపేటలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుంది అని దీనిని విజయవంతం చేయవలసిన బాధ్యత ప్రతీ హిందువు మీద ఉంది అని వడయర్ అన్నారు. ఈ కార్యక్రమం సంస్కృత కార్యక్రమాలతో ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుంది అని ఈ కార్యక్రమానికి శృంగవృక్షం పీఠాధిపతి మరియు ధర్మిక సామజిక పరిషత్ అధ్యక్షులు శ్రీ సాయి దత్త నాగనంద సరస్వతి స్వామీజీ మరియు ప్రధాన వక్తగా చంద్రశేఖర్ ఆర్ యాస్ యాస్ ప్రాంత శారీరక్ ప్రముఖ్ ఒంగోలు విచ్చేస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యనందం, ఆర్ యాస్ యాస్ కోనసీమ బౌద్ధ ప్రముఖ్ టిఎస్ఆర్ ఆంజనేయులు, నిర్వహన సమితి సభ్యులు సత్తిరాజు ఉషా రాణి,చోడపనీడి భాస్కర్ రావు,బండారు చిన గంగరాజు, శ్రీగ్రాకోలాపు ఉషా క్రాంతి, దునబోయిన నాగేశ్వరావు, సిద్ధంశెట్టి గంగారావు, మట్ట వెంకటేశ్వరరావు, పచ్చిపులుసు వెంకటేష్ గుప్తా,బీజేపీ మండల అధ్యక్షులు సంపతి కనకేశ్వరరావు, రాష్ట్ర యువ మోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయ ప్రకాష్ నారాయణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, ఉద్ధరాజు ప్రసాద్ రాజు, అన్యం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### వైయస్సార్ స్మృతి మందిర ప్రారంభోత్సవానికి

# మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కినకు ఆహ్వానం

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** యానాం ఎర్ర గార్డెన్స్‌లో నిర్మించిన వైయస్సార్ స్మృతి మందిరం, విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 21 ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో యానాం మాజీ ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు ఆహ్వానం పలికేందుకు గురువారం మండపేట విచ్చేశారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) లను ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరావు, సీనియర్ నాయకులు శివకోటి శేష సుబ్రమణ్యం, సొసైటీ మాజీ అధ్యక్షులు పెంకే గంగాధర్, యూత్ నాయకుడు దుగ్గిరాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



### సీఎం చంద్రబాబును కలిసిన

# 'పిల్లి' దంపతులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమం కోసం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి దంపతులు విజయవాడ సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులు, నియోజక వర్గ సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.వారి వినతిని శ్రద్ధగా విన్న ముఖ్యమంత్రి నియోజకవర్గ అభివృద్ధి, పెండింగ్ పనుల పూర్తి, కార్యకర్తల సంక్షేమం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చినట్లు పిల్లి దంపతులు తెలిపారు. అనంతరం హోం మంత్రి వంగలపూడి అనిత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాలు అందజేసి, కాకినాడ రూరల్ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. మంత్రులను కలిసిన వారిలో పెరిక సాధికారిక కమిటీ జిల్లా కన్వీనర్, కో క్లస్టర్ కొమరిశెట్టి నరసింగరావు, 42వ డివిజన్ ఇంచార్జ్ ఎలాగా లోవరాజు తదితరులు ఉన్నారు.

### ప్యారి షుగర్ పరిశ్రమలో

# అప్పటి ప్రమాదం 'గాల్లో' పరిహారం

### మూడేళ్లుగా ఎదురుచూస్తున్న బాధితుడు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదం కాకినాడ జిల్లా.. కాకినాడ రూరల్ వాకలపూడి గ్రామం పరిధిలో ఉన్నటువంటి ప్యారి షుగర్ లో ప్రమాదం జరిగి సుమారు మూడు ఏళ్లు కావస్తుంది. గాయాల పాలై చచ్చి బతికిన బాధితుడు రాయుడు సతీష్‌కు ఇప్పటికీ అందనినష్టపరిహారం.. ప్రమాదం 22 -8- 2022లో జరిగిందని తెలిపిన బాధితుడు సాక్షాత్తు అప్పటి జిల్లా కలెక్టర్ కృతికా శుక్ల ఐపీఎస్, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, మంత్రి కురసాల కన్నబాబు బాధితుల తరపున యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. కానీ ఇతనికి అందని నష్టపరిహారం ఇందులో గాయపడిన ఏడుగురులో ఒకరైనటువంటి రాయుడు సతీష్ అనే వ్యక్తికి ఎటువంటి నష్టపరిహారం అందలేదని షుగర్ ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న బాధితుడు... ఒక ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ద్వారా ఆరోజు భారీ షుగర్ లో పనిచేయడం జరిగిందని ప్రమాదం పాలై మూడు సంవత్సరాలగా తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్నారని నాకు ఎటువంటి నష్టపరిహారం పరిశ్రమ నుండి నాకు అందలేదని తెలుపుతున్న బాధితుడు ఈ విషయంపై మీడియాని ఆశ్రయించి తనకు న్యాయం చేయాలనికోరుతున్న బాధితుడు... నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్న పారి షుగర్ యాజమాన్యం సిబ్బంది... ఇనోదయ హాస్పటల్లో వైద్య నిమిత్తం జాయిన్ చేసి కనీసం పట్టించుకోలేదని అక్కడే వదిలేసి వెళ్లిపోయారని పరిశ్రమ యాజమాన్యం ఎవరూ పరామర్శించలేదని మీడియా ముందు వాపోతున్న బాధితులు సతీష్.

# ప్రస్తుత వరి సాగు దిగుబడులు ఆశాజనకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శంఖవరం మండలంలో ప్రస్తుత వరి సాగు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని వ్యవసాయ అధికారి పడాల గాంధీ తెలిపారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం వాద్రేవు వెంకటాపురంలో రైత్వారీ వ్యవసాయ క్షేత్రాల్లో గాంధీ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ సహాయకులు గురువారం పంట కోత ప్రయోగాలను నిర్వహించారు. వరి మినికిట్ ఆర్.జి.ఎల్. 7038 రకం వరి సాగు చేసిన పొలంలో ప్లాట్ కు 15.255 కిలోల దిగుబడి గమని%శీ%చి, దీని ప్రకారం ఎకరాకు సుమారుగా 30 నుంచి 33 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు గణించారు. ఫలితంగా ప్రస్తుత వరి సాగు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని వ్యవసాయ అధికారి గాంధీ ప్రకటించారు. అనంతరం వరి కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రబీలో సాగు చేసే వరి, అపరాల రకాలు, ధాన్యం కొనుగోలు, మద్దతు ధరలు వంటి అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ. శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకులు క్రాంతి, శ్యాం సుందర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లోలాక్షి, రమణ పాల్గొన్నారు.

### ఘనంగా ప్రత్తిపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో

# క్రిస్మస్ సెలబ్రేషన్స్-2025

### ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ





**ప్రతిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలం వొమ్మంగి గ్రామంలో పాస్టర్ ప్రభాకర్ రావు మందిర ఆవరణలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ క్రిస్మస్ సెలబ్రేషన్స్-2025 ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే సత్య ప్రభను పాస్టర్ ఫెలోషిప్ మండల ప్రెసిడెంట్ సెక్రటరీ ముఖ్యమైన వారు సాధనంగా ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా సత్య ప్రభ మాట్లాడుతూ క్రైస్తవ సోదరులు, సోదరీమణులు మరియు దైవజనులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ భక్తుడైన తన భర్త వరపుల రాజా ఆలోచనలు, ఆశయాలు, సేవలను గుర్తుంచు కొని తనని కూడా ఇంత ప్రేమ అభిమానులతో ఆదరిస్తున్నందుకు దైవజన బృందావనం అంతటికీ కృతజ్ఞతలు తెలియజేసారు. తాను కూడా అందరికీ ఉపయోగపడే విధంగా పాస్టర్స్ కమిటీ వారు నా దృష్టికి తీసుకువచ్చిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని రానున్న రోజుల్లో కమిటీ & హాల్ కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా వివరించారు. క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా జరుపుకునే మహత్తర పండుగ అని అందరూ క్రిస్మస్ ఆనందంగా జరుపుకోవాలని పేర్కొంటూ ఈ క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం, వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్. బిషప్ జాన్ మాషా, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ జి.సుందరరావు, సెక్రటరీ పాస్టర్ పులి సాల్మన్, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ పి వైస్ మన్, ట్రెజరర్ ఏబిసిడి ప్రసాద్, కాకినాడ జిల్లా యునైటెడ్ పాస్టర్స్ క్యాబినెట్ బృందం, బిషప్. ఇమ్మానుయేల్ మసా, పాస్టర్ వల్లూరి రత్నం, పాస్టర్ జాన్ సామ్యూల్, పాస్టర్ డి.రాజబాబు, పాస్టర్ వి.కృపావరం, పాస్టర్ రాజాల షాలెం, మరియు స్టీరింగ్ కమిటీ సభ్యులు వివిధ గ్రామాల పాస్టర్లు గ్రామ పెద్దలు, మరియు ముఖ్య నాయకులు, యాళ్ల జగదీష్. గొంతిన సురేష్, వెలుగుల నాని, మరియు విశ్వాసులు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

### ప్రపంచ మార్కెట్‌కు దీటుగా

# ఫర్నిచర్ రంగాన్ని బలోపేతం చేయండి

### లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్..



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో ఫర్నిచర్ తయారీ, ఎగుమతులను ప్రపంచ మార్కెట్‌కు దీటుగా బలోపేతం చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్ సభలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఈ అంశాన్ని లేవనెత్తారు. గ్లోబల్ మార్కెట్లో నేడు ఫర్నిచర్ తయారీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు, ఫర్నిచర్ తయారీ, ఎగుమతులు ప్రపంచవ్యాప్తంగా 800 బిలియన్ అమెరికన్ డాలర్లు దాటే అవకాశం ఉందన్నారు, మనదేశంలో ఫర్నిచర్ తయారీకి నిపుణులైన కార్మికులు, వనరులతో పాటు దేశ, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఉన్నప్పటికీ నేడు ప్రపంచ ఫర్నిచర్ ఎగుమతుల్లో మన వాటా కేవలం 1 శాతం మాత్రమేనన్నారు, ఈ రంగంలో మలేషియా, వియాత్నం వంటి చిన్న ఆర్థిక వ్యవస్థల కంటే మన దేశం వెనుకబడడం విచారకరమన్నారు. మనదేశంలో సుమారు 85 శాతం ఫర్నిచర్‌ను అనధికార కార్పెంటర్లు తయారు చేస్తుండడంతో నాణ్యత కొరవడి ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని,దీంతోపాటు ఇంజనీర్ వుడ్, ఇతర పరికరాలపై విధిస్తున్న అధిక సుంకాల వల్ల ఖర్చులు అమాంతం పెరుగుతున్నాయన్నారు. దీంతో పాటు దేశంలో లాజిస్టిక్ లు పోర్ట్ లకు దూరంగా ఉండడంతో ఎగుమతి దారులు కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు, దీన్ని అధిగమించేందుకు అపార అవకాశాలున్న పోర్ట్ ఆధారిత కాకినాడ వంటి ప్రదేశాల్లో ఇంటిగ్రేటెడ్ క్లస్టర్స్ ఏర్పాటుతో ఖర్చులు గణనీయంగా తగ్గి ఎగుమతులు మరింత పెరుగుతాయన్నారు. దీంతో పాటు కేంద్రం కూడా దీనిపై ప్రత్యేక ద్రుష్టి సారించి దేశంలో పోర్ట్ అనుసంధానిత లాజిస్టిక్స్ తో మెగా ఫర్నిచర్ పార్క్ లు స్థాపన, సుంకాలు తగ్గింపు, నీతి అయోగ్ సిఫార్సులు మేరకు ఫర్నిచర్ తయారీకి ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పిఎల్ఐ) స్కీం ప్రారంభించడంతో పాటు దేశీయ ఫర్నిచర్‌కు బ్రాండింగ్ కల్పించడం, అంతర్జాతీయ ప్రమాణాలతో ఫర్నిచర్ తయారీకి డిజైన్ మరియు స్కిల్ ఇనిస్టిట్యూట్‌లు ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తే ఫర్నిచర్ తయారీ, ఎగుమతుల్లో మనదేశం అగ్రగామిగా నిలుస్తుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మన వారసత్వ సంపద వృద్ధులు



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** వృద్ధులు సమాజ వారసత్వ సంపద అని,వారిని ఆదరించాల్సిన గౌరవం వారి కుటుంబ సభ్యులతో పాటు సమాజానికి ఉందని దేవాదాయ శాఖకు చెందిన పిఠాపురం పాదగయ క్షేత్రం అసిస్టెంట్ కమిషనర్, ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ అన్నారు. ముఖ్యంగా అనాథ వృద్ధులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలి అన్నారు. జనసేన గోదావరి జిల్లాల కోఆర్డినేటర్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ కాట్నం విశాల లక్ష్మి జన్మదినం సందర్భంగా ఆమె భర్త, అసిస్టెంట్ కమిషనర్ జగన్మోహన శ్రీనివాస్ గురువారం కరప మండలం నడుకుదురులోని జనావళి అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు, పండ్లు, స్వీట్లు, బ్రెడ్లు, దుప్పట్లు, నూతన వస్త్రాలు ఇతర నిత్యావసర వినియోగ వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతమంది వృద్ధుల మధ్య కార్యక్రమం జరపడం ఆనందంగా ఉంది అన్నారు. తమ శాఖకు చెందిన జాయింట్ కమిషనర్ ,అన్నవరం ఈవో వేంద్ర త్రినాథ రావు కొన్ని సంవత్సరాల నుంచి ఈ ఆశ్రమవృద్ధులకు సహాయం అందజేస్తున్నారని, దానిని స్ఫూర్తిగా తీసుకుని తన సతీమణి జన్మదినాన్ని ఇక్కడ నిర్వహించినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు అందరూ ఈ ఆశ్రమానికి చేయూతనివ్వడం ఆనందంగా ఉంది అన్నారు. వృద్ధులు విశాల లక్ష్మి దంపతులను ఆశీర్వదించారు.. కార్యక్రమంలో దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రోలర్ స్కేటింగ్‌లో మూడు బంగారు పథకాలు సాధించిన కాకినాడ బాలిక

### ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలో జరుగుతున్న రోలర్ స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో భాగంగా కాకినాడ ఆశ్రమం పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న ఆకుల కావ్యశ్రీ పలు విభాగాల్లో మూడు బంగారు పతకాలు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో ఆకుల కావ్యశ్రీ తన తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ను మర్యాదపూర్వకంగా కలిసింది. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ రోలర్ స్కేటింగ్ జాతీయ స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి మూడు బంగారు పథకాలు సాధించడం గొప్ప విశేషమని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ సందర్భంగా కావ్యశ్రీని ప్రత్యేకంగా అభినందనందించారు. ఇదే పట్టుదల, స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కాకినాడకు గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కావ్యశ్రీకి సూచించారు. కార్యక్రమంలో ఐఎల్‌ఏ అధ్యక్షులు పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తుని జనసేన పార్టీలో భారీగా మహిళల చేరిక



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం నుంచి జనసేన పార్టీలో భారీగా మహిళలు చేరారు. రాష్ట్ర పార్టీ ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ నల్లం వాసు ప్రోత్సాహంతో కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సూచనల మేరకు తుని ధోనీసేన పార్టీ వీర మహిళ కసిరెడ్డి దుర్గారత్నం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ చేరికలు ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా ఆ మహిళలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పరిపాలనా దక్షత, ప్రజా సమస్యలు పరిష్కారంలో ఆయన చూపుతున్న చొరవ, ఫలితంగా కనిపిస్తున్న ఫలితాలు, అలాగే కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కు తన పార్లమెంటు పరిధిలోని ప్రజలకు సేవ చేయడం పట్ల ఆయనకు ఉన్నటువంటి అంకిత భావానికి, నిబద్ధతకూ ఆకర్షితులమై జనసేన పార్టీలో తాము సామూహికంగా చేరామని ప్రకటించారు. రాబోయే కాలంలో రాష్ట్రంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలకు మరింత మేలు, అభివృద్ధి జరుగుతుందని తాము ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో తుని నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు బోనం చిన్నబాబు, దండెం రామకృష్ణ, బాలికల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మగసాల శ్రీనివాస్, తుని పట్టణ నాయకులు కనిగిరి ప్రకాష్, గడ్డమూరి నవీన్, నాగబాబు, తేజోమూర్తుల గిరిస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రజలూ పాల్గొన్నారు.

# ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నతో రాష్ట్ర క్రీడా రంగంపై కేంద్రం దృష్టి



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, శిక్షణా కేంద్రాలు, ఖేలో ఇండియా కార్యక్రమాల పురోగతిపై రాజ్యసభలో గురువారం ముఖ్యమైన వివరాలు వెల్లడయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవియా సమగ్ర సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో ఖేలో ఇండియా సెంటర్లు, స్టేట్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, జిల్లా స్థాయి శిక్షణా కేంద్రాలు, సాయ్ ఎన్‌సిఓఈలు, ఎస్‌టీసిలు, అవుట్‌రిచ్ కార్యక్రమాలు వంటి అన్ని శిక్షణా సదుపాయాల వివరాలు ప్రభుత్వ డాష్‌బోర్డుల్లో అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. క్రీడా నిధులు రాష్ట్రాల వారీగా కాకుండా పథకాల వారీగా కేటాయించబడుతాయని ఆయన స్పష్టం చేశారు. ఫలితంగా, గత ఐదేళ్లలో కాకినాడ జిల్లాకు ప్రత్యేక నిధుల కేటాయింపుపై వేరే రికార్డు లేనట్లు మంత్రి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా క్రీడా రంగానికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్లు వివరాలు వెల్లడించారు. 2024-25లో రూ.2332.50 కోట్లు, 2023-24లో రూ.2380.86 కోట్లు, 2022-23లో రూ.1907.69 కోట్లు కేటాయించగా, వీటి వినియోగం 90-95 శాతాల్లో నమోదైందన్నారు. అలాగే, 2023-24 నుంచే ఖేలో ఇండియా అథ్లెట్లను( టీ ఓ పి ఎస్) పథకంలో చేర్చినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో, ముఖ్యంగా కాకినాడ జిల్లాలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆధునిక శిక్షణా కేంద్రాలు, యువ క్రీడాకారులకు అవకాశాల విషయాల్లో ఎంపీ సానా సతీష్ బాబు నిరంతరంగా కృషి చేస్తున్నారని. ఆయన తాజా ప్రశ్నతో ఆంధ్రప్రదేశ్ క్రీడా అభివృద్ధి అంశం మళ్లీ కేంద్ర దృష్టిని ఆకర్షించినట్లు అయింది.

### వంగవీటి రంగా ఆశయసాధనే

# లక్ష్యంగా పనిచేస్తాం..

### ఉమ్మడి జిల్లాల రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు సలాది.. డిసెంబర్ 26ఛలో వైజాగ్ విజయవంతం చేయాలని పిలుపు..




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగా ఆశయసాధనే లక్ష్యంగా పనిచేస్తాం అని కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు నానాజీనీ కలసి రూరల్ లో రంగా విగ్రహం ఏర్పాటు చేస్తాం అని ఉమ్మడి జిల్లాల రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడుసలాది శ్రీనివాస్ బాబు అన్నారు. స్థానిక గైగోలుపాడు విడిదిల్లు ఫంక్షన్ హాల్ లో సలాది శ్రీనివాస్ బాబు ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంజరిగింది. ఈనెల డిసెంబర్ 26న ఛలో వైజాగ్ సభ విజయ వంతం చేయాలని పత్రికా సమావేశం లో ఉత్తరాంధ్ర జిల్లాల ఇంఛార్జ్ B.N.మూర్తి పిలుపునిచ్చారు. అనంతరం రంగానాడు పోస్టర్ ఆవిష్కరణ కాపు నాయకులు రెడ్లరాఘవరావు, గరగపెదబాబులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సభకు వంగవీటి కుమార్తె వంగవీటి ఆశ కిరణ్, రంగా రాయల్స్ గాదె బాలాజీ, వంగవీటి శంతన్, నెం.1 న్యూస్ ఛానల్ అధినేత మంచాల సుధాకర్ నాయుడు తదితరులు పార్టీలకు అతీతంగా ఒకే చోటకు వస్తున్నారని మా అందరి సిద్ధాంతం ఒక్కటే కృష్ణా జిల్లాకు వంగవీటి రంగా రావు జిల్లాగా ఈ కూటమి ప్రభుత్వం నామకరణం చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు అనిఅన్నారు.ఈకార్యక్రమంలో రంగా అభిమానులు మెహర్ గంగాధర్, చూగాని మనోజ్, కొండపల్లి పుత్ర రావు, అడబాల సత్యనారాయణ, పాండ్రంకి రాజు, పవన్ బార్ బాబురావు, పన్నీర్ వెంకటేశ్వర రావు, హిట్లర్, పబ్బినీడి అజయ్, బిందాన సురేష్, గరగ శ్రీనివాస్ రావు, పులి సతీష్, సురపరెడ్డి శ్రీను, చింతలపూడి ప్రసాద్ సర్కిల్, ప్రగడ చిన్న తదితరులు పాల్గొన్నారు.

# సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలపై 15న ధర్నా

### వేతనాల పెంచాలని, మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సమగ్ర శిక్షలో పని చేసే క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్స్ వేత నాలు పెంచాలని, దూర ప్రాంతాల బదిలీలు ఆపాలని, హెచ్.ఆర్ పాలసీ, మినిమం టైమ్ స్కెల్ అమలు చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద 15వ తేదీ ధర్నా చేపడుతున్నామని తెలియజేస్తూ డీఈవో పిల్లి రమేష్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ మొబైల్ టీచర్స్ యునైటెడ్ ఫోరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తెలిపే రాంజీ ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్ మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల నుండి సిఆర్‌ఎంటిల వేతనాలు ప్రభుత్వం పెంచలేదని, ధరలు చూస్తే విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మినిమం టైం స్కేల్, హెచ్ ఆర్ పాలసీ ఇతర రాష్ట్రాలతో అమలు జరుగుతున్నాయని, ఆంధ్రప్రదేశ్లో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 25 స్కూల్స్ క్లస్టర్లకు ఒక్క సీఆర్పీ మాత్రమే ఎలా సరిపోతాడని ప్రశ్నించారు. తక్షణం పాత పద్ధతిలోనే క్లస్టర్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. పై డిమాండ్ల సాధన కోసం 15వతేది సిఆర్‌ఎంటి లందరూ మాస్ క్యాజువల్ లీవ్ పెట్టుకుని ధర్నా కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రిసోర్స్ పర్సన్స్ వర్కింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తరాల మీరా సాహెబ్, కోశాధికారి ఎం.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఇరువర్గాల ప్రజలతో చర్చలు జరిపిన

# ఆర్డీవో మల్లిబాబు..



**గొల్లప్రోలు, విశ్వం వాయిస్ :** గొల్లప్రోలు పట్టణంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.గత నాలుగు రోజులుగా గొల్లప్రోలు పట్టణంలో కొత్తపేట ప్రాంతంలో అనుమతులు లేకుండా అన్యమత ప్రచారం జరుగుతోందని ఉద్రిక్తత నెలకొన్న నేపథ్యంలో రెండు చర్చిలను తాత్కాలికంగా నిలుపుదల చేసామని, కానీ క్రిస్మస్ నెల కావడంతో వారి మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ఇరువర్గాల ప్రజలతో గురువారం సాయంత్రం చర్చలు జరిపినట్లు ఆర్డీవో మల్లిబాబు తెలియజేశారు. దాదాపు ఇరువర్గాల అంగీకారంతో సమస్య పరిష్కారం అయ్యిందని, రేపు మరలా ఇరువర్గాలతో మరోసారి చర్చించి శాంతియుతంగా ఉంచేందుకు కృషి చేస్తామని ఆర్డీవో మల్లిబాబు తెలిపారు.ఇరువర్గాల నుంచి ఎవరూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని,అలా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిఐ శ్రీనివాస్,ఎస్ఐ రామకృష్ణలు సిబ్బంది సహాయంతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టారు.కాగా కొత్తపేటలో పోలీసు పికెట్ కొనసాగుతూనే ఉంది.

# కలెక్టర్‌ని కలిసిన మజ్జి కృష్ణారావు




**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తు సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా నూతన సైనిక సంక్షేమ శాఖ అధికారిగా నియమితులైన మజ్జి కృష్ణారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు.



## ఆలయ అభివృద్ధి,

# భక్తులకు సమర్థవంతంగా సేవలు అందిస్తాం..

### ఘనంగా జోడుగుళ్ల నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం
### కమిటీని అభినందించిన రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి





**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి నదిని ఆనుకుని ఉన్న అన్ని దేవాలయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి సంకల్పించామని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. అందుకే దేవాలయాలకు ఆధ్యాత్మిక చింతన కలిగిన మంచి వ్యక్తులను ఎంపిక చేసి కమిటీల్లో బాధ్యతలు అప్పగిస్తున్నామని తెలిపారు. స్థానిక గోదావరి గట్టున టి-నగర్లో వేంచేసియున్న శ్రీ బాలత్రిపుర సుందరి అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం (జోడుగుళ్లు) నూతన కమిటీ చైర్మన్ గా బొలిశెట్టి శ్రీనివాస్, డైరెక్టర్లుగా ఐశెట్టి వీరవెంకట రమణ, సింగవరపు సత్యనారాయణ, మెరపల మోహిని, బోయి రాము, కొర్రపాటి లక్ష్మీ, సంగంరెడ్డి సుబ్బాయమ్మ, ఆలేటి ధనలక్ష్మి, ఇనపకుర్తి ఈశ్వరరావు, కొండవీటి మౌళీశ్వరరావులతో ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు. గోరంట్ల మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నాటికి అన్ని దేవస్థానాలను మళ్లీ అభివృద్ధిలోకి తెస్తున్నామని, అందరి సహకారంతో పుష్కరాలు విజయవంతంగా జరిగేలా చేస్తామన్నారు. ఇప్పటికే సరస్వతి ఘాట్, గౌతమ ఘాట్లో 12 ఆలయాలు అందుబాటులో ఉ న్నాయని, వాటి ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మికత వెల్లి విరుస్తుందన్నారు. పట్టపగలు వెంకట్రావు సారధ్యంలో మహాకాళేశ్వరాలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, త్వరలోనే సరస్వతి అమ్మవారి ఆలయం కూడా ప్రారంభమవుతుందన్నారు. బొలిశెట్టి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు సమర్థవంతంగా సేవలందించడానికి కృషిచేస్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టూరిజం డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కూటమి నాయకులు నిమ్మలపూడి గోవింద్, శీలం గోవింద్, చొప్పెర్ల బ్రహ్మాజీ, పల్లి సాయి, వాసిరెడ్డి బాబీ, బూర రామచంద్రరావు, బూర దుర్గాంజనేయరావు, దాలిపర్తి వేమన, కందికొండ రమేష్, యానాపు యేసు, చొప్పెర్ల వీరభద్రరావు, కొప్పిశెట్టి చిన్నిర్యాలీ అప్పన్నబాబు,ర్యాలీ సత్తిరాజు, కుసుమ, ఇఓ ఎం. శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# బర్లపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం..

### అతనిపై క్రిమినల్... పరువు నష్టం కేసులు పెడతాం..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** టీడీపీ పార్టీకి సంబంధం లేని వ్యక్తి నిరాధార ఆరోపణలతో పార్టీ ప్రతిష్టకు నాయకుల ప్రజాప్రతినిధుల పరువును బజార్ కి ఏడుస్తున్న బాబురావు అనే వ్యక్తిపై క్రిమినల్, పరువు నష్టం కేసులు పెడతామని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, మాజీ కార్పొరేటర్ కిలపర్తి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గత కొన్ని నెలలుగా వీరిద్దరూ మద్యం సిండికేట్ దారులతో కుమ్ముక్కయ్యారని అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మీడియాకు లంచాలు ఇవ్వాలని చెప్పి లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారని బాబురావు ఆరోపణలు చేసిన సంగతి విధితమే. మేరకు స్థానిక ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మజ్జి రాంబాబు మాట్లాడుతూ బర్ల బాబురావు అనే వ్యక్తి మానసిక పరిస్థితి బాగోలేదని, అతని మాటలు వెనుక బ్లాక్ మెయిలింగ్,చీటింగ్ దురుద్దేశాలు ఉన్నాయని అతనొక చీటర్ ని మండిపడ్డారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా, జిల్లా బీసీ సంఘం నాయకుడని చెప్పుకుంటూ తిరుగుతూ మోసం చేయగా రాజానగరం నియోజక వర్గంలో కొంతమంది వ్యక్తులు తన్ని తరిమేసారని గుర్తు చేశారు. అతని మాటల్ని పట్టించుకోవసరం లేదని, అతని దగ్గర మూడు ఆడియోల లో అతని కుమారుడు సురేంద్ర ఉన్నాడని లంచం ఇవ్వడం, పుచ్చుకోవడం నేరమే కాబట్టి లంచాలు ఇచ్చిన అతని కుమారుడు కూడా నేరస్తుడవుతాడని రాంబాబు తెలిపారు. రాజకీయాలు వేరు, వ్యాపారాలు వేరని గతంలో కూడా ఇటువంటి ఆరోపణలు చేశాడని అతని పార్టీ దెబ్బతింటున్న విషయాన్ని పార్టీ అదిస్థానం దృష్టికి తీసుకువెళ్లి కఠిన చర్యలు తీసుకునేలాగా స్థానిక ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటారన్నారు. ప్రజా ప్రతినిధిగా మద్యం వ్యాపారంతో సంబంధాలు ఏమున్నాయిని ఎమ్మెల్యే పై అను చితంగా మాట్లాడడం అతనీ స్థాయి సరిపోదన్నారు. అతను వైసిపి కోవర్ట్ అని తెలుగు దేశం పార్టీతో సంబంధం లేని పితాని కుటుంబరావుతో కలిసి మాజీ ఎంపీ మార్గాని భరత్ స్క్రిప్ చదువుతున్నాడని రాంబాబు ఆరోపించారు. తనను బ్లాక్ టికెట్లు అమ్ముకొని పైకి వచ్చినట్లుగా బర్ల ఆరోపణల పై తీవ్రంగా స్పందిస్తున్నారని అతనిపై పరువు నష్టం చేసి వేస్తానని మధ్య రాంబాబు తెలిపారు. తాము విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నామని బర్ల వలె బ్లాక్మెయిలింగ్ రాజకీయాలు చేయడం లేదని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధిష్టానం గుమ్మం కూడా తొక్కలేని వ్యక్తి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ పేర్లు చెప్పుకొని చీటింగ్ రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. మాజీ కార్పొరేటర్ కిలపర్తి శ్రీనివాస మాట్లాడుతూ గత కొంతకాలంగా తెలుగుదేశం పార్టీ నాయకులపైన, ప్రజాప్రతినిధులైన అనుచితమైన వ్యాఖ్యలు చేస్తూ పరువు తీస్తున్న బర్ల బాబురావు పై క్రిమినల్ సివిల్ కేసులు పెడుతున్నామా పెడుతున్నట్లు తెలిపారు. న్యాయవాది పూడి నవీన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు మజ్జి రాంబాబు, కిలపర్తి శ్రీనివాసులపై ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో వ్యక్తిగత పరువు మర్యాదలకు భంగంగా మారిన బాబురావుపై న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఇచ్చిన పోలీస్ ఫిర్యాదులపై తదుపరి చర్యల పై వేసి చూస్తున్నట్లు తెలిపారు.

# ప్రెస్ క్లబ్ ఎన్నికల కోసం జేఏసీ ఏర్పాటు

### జర్నలిస్ట్ సంఘాలకు అతీతంగా అందరూ కలిసి పోరాడాలని జేఏసీ నిర్ణయం - కలెక్టర్,ఎస్పీ,ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం ఇవ్వడానికి జేఏసీ తీర్మానం





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికల కోసం జర్నలిస్ట్ సంఘాలకు అతీతంగా కొందరు జర్నలిస్టులు జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ)ని ఏర్పాటు చేసుకున్నారు. గురువారం సాయంత్రం రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో విలేకరులు పాల్గొన్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహణ, ప్రెస్ క్లబ్ ఆర్థిక లావాదేవీలు అజెండాలుగా చర్చ కొనసాగింది. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన చర్చలో పలువురు జర్నలిస్టు వారి యొక్క వ్యక్తి గత అభిప్రాయాలను తెలియజేశారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ కోసం జర్నలిస్టులు ఒక జేఏసీ ని ఏర్పాటు చేసుకున్నారు. అందరి సభ్యుల ఆమోదంతో జేఏసీ తదుపరి కార్యాచరణకు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి ఒక వినతిపత్రం సమర్పించాలని, కలెక్టర్తో పాటు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్కు, ప్రజా ప్రతినిధులకు, ఎమ్మెల్యేలకు, ఎంపీలకు, మంత్రికి కూడా వినతిపత్రం సమర్పించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసుకున్నారు. కలెక్టర్కు సమర్పించిన తర్వాత కలెక్టర్ నిర్ణయాలను బట్టి తదుపరి కార్యాచరణ చేయాలని జేఏసీ నిర్ణయించారు. కలెక్టర్కు సమర్పించే వినతి పత్రంలో ఎన్నికల జరిపించాలని, ఇప్పటివరకు ప్రెస్ క్లబ్ ఆర్థిక లావాదేవీలు, ఆడిట్ ను ప్రస్తుత పాలకవర్గంగా భావిస్తున్న వారు బహిరంగా తెలపాలని పత్రం విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్కు సమర్పించనున్నారు. జేఏసీ చైర్మన్గా చేబోలు రాజు,వైస్ చైర్మన్ మారంపూడి సోమరాజు, కన్వీనర్ దుమ్ముల అబ్రహాం లింకన్ ,కో-కన్వీనర్ వెలుగూరి రవికుమార్, ఆర్గనైజర్ గాదె గిరీష్ కుమార్,గౌరవ సలహాదారు పొక్కులూరి రామమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ నమ్మి శ్రీనివాస రావు, దేవులపల్లి అన్నపూర్ణ విశాలాక్షి, పోతుల వెంకటేశ్వరావు, ఇందుగల దామోదర్,సింగంశెట్టి సూర్య రాఘవేంద్ర, తోటకూర పురుషోత్తం, మీడియా కో ఆర్డినేటర్స్ ఎం వి ఎస్ రమేష్, కుడెల్లి రత్న కిషోర్ నియమితులు అయ్యారు. ఈ కార్యక్రమంలో విలేకరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.జేఏసీగా నీయమీతులైన వారికి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ అభినందనలు తెలియజేశారు. న్యాయపరంగా జేఏసీ నడిపించే దిశలో తను ఉన్నానంటూ ఆయన విలేకరులకు భరోసా కల్పించారు.

# 'క్వాయర్ టెక్నాలజీ మ్యాట్ల వినియోగంతో సీసీ రోడ్లు ఐదేళ్లు ఎక్కువ మన్నిక'



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో బిటి, సీసీ రోడ్లు నిర్మాణంలో క్వాయర్ టెక్నాలజీ మ్యాట్ల వినియోగం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుని రోడ్ల సాధారణం కన్నా 5 సంవత్స రాలు మన్నిక పెరుగుతోందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. గురువారం స్థానిక మండల పరిధిలోని ఎంట్రికోన ఓడలరేవు ప్రాంతాలలో క్వాయర్ టెక్నాలజీ మ్యాట్లతో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎంట్రికోన గ్రామం లో కాయర్ టెక్నాలజీ జియో టెక్స్టైల్ మాట్స్ ఉపయోగించి సుమారు అర కిలోమీటర్ మేర రూ.1.46 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ముందుగా పరిశీలించి క్వాయర్ టెక్నాలజీ మ్యాట్లు వినియోగ తీరును పరి శీలించడం జరిగిందన్నారు ఇటీవల నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సదస్సులో కాయర్ టెక్నాలజీ మ్యాట్ల గురించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారితో చర్చించడం జరిగిందని ఆ మేరకు జిల్లాలో రోడ్ల నిర్మా ణాలను బలోపేతం చేసే సాధారణం కన్నా కనీసం 5 సంవత్సరాలు అదనంగా మన్నిక ఉండేలా చర్యలు గైకొనడం జరిగిందన్నారు. ఈ యొక్క కాయర్ టెక్నాలజీ మ్యాట్ల వినియోగం మూలంగా లూజు మట్టి తొందరగా రోడ్డుకి ఇరువైపులా జారి పోకుండా రోడ్డుకు మరింత పటిష్టతను సమకూర్చి సాధారణంకన్నా మరో 5 సంవత్సరాలు మన్నిక ఉండేలా దోహద పడుతుందని కావున డెల్టా ప్రాంతమైన కోనసీమ జిల్లా లో ఈ యొక్క టెక్నాలజీ సత్ఫలితాలను ఇవ్వడంతో పంచాయతీరాజ్ రహదారులు భవనాలశాఖ జల వనరులు డ్రైనేజీ విభాగాల సమన్వయంతో వివిధ రకాల రహదారులు, కాలువ ఏటి డ్రైనేజీ గట్ల పటిష్టతలో ఈ యొక్క క్వాయర్ టెక్నాలజీ మ్యాట్ల వినియోగించే విధంగా జిల్లాలో చేపట్టే ఈ యొక్క పనులకు మ్యాట్లు వినియోగాన్ని ప్రతిపాదనలలో చేరుస్తూ ఆ మేరకు నిధులు మంజూరు చేయడం జరిగేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పంచాయతీ రాజ్ పర్యవేక్షకఇంజనీర్ పులి రామకృష్ణా రెడ్డి, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్ అన్యం రాంబాబు సహాయ ఇంజనీర్ దుర్గా కొండలరావు ఇరు గ్రామాల సర్పంచులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో గాయపడిన శిల్పి శ్రీనుకు ఆర్థిక చేయూత



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మండలంలోని పశ్చిమ గోనగూడెం గ్రామానికి చెందిన శిల్పి బూరెడ్డి శ్రీను ఇటీవల ప్రమాదానికి గురై కొద్దిరోజులుగా ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం శ్రీ వరలక్ష్మీ గణపతి శిల్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రమాదానికి గురైన శీనును పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంఘం ఆధ్వర్యంలో 70వేల రూపాయల నగదును గోనగూడెం సర్పంచ్ రొంగల దేవికా శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బండారు సుబ్బారావు, వానపల్లి సుందర్రావు, కొప్పిశెట్టి రమణ, రాయవరపు నారాయణ, భూరెడ్డి వెంకటేశ్వరరావు, పండూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### అంతరించిపోతున్న ఆయుర్వేదానికి

# నూతన ఊపిరిలయ సంస్థ

### - ఐఎన్ఎ మాజీ ఉపాధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం..
### - వేమగిరి బుద్ధ విహారంలో 'ఆయుర్వేద ప్రాక్టీషనర్స్' శిక్షణా కార్యక్రమం



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం వేమగిరి బుద్ధ విహార ప్రాంగణంలో లయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుర్వేదిక్ ప్రాక్టీషనర్స్ శిక్షణా కార్యక్రమం రెండు రోజులపాటు ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అఖిల భారత నర్సరీ సంఘం మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి గిరిజన ప్రాంతాల్లో ఆచార సంప్రదాయంగా కొనసాగుతున్న వనమూలిక వైద్యాన్ని తిరిగి వెలుగులోకి తెచ్చేందుకు లయ సంస్థ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగకరం అన్నారు. లయ సంస్థ కోఆర్డినేటర్ గుగ్గిలపు బుల్లియ మాట్లాడుతూ ఒకప్పుడు దేవ వైద్యంగా ప్రసిద్ధి పొందిన వనమూలిక వైద్యాన్ని సంరక్షించటం మా సంస్థ ముఖ్య ధ్యేయం. గిరిజన యువతకు పూర్వీకుల వైద్య సంపదను పునరుద్ధరించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు.గత సంవత్సరం నుంచి కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో బ్యాచ్‌ల వారీగా 20-25 మంది చొప్పున ఇప్పటివరకు ఆరు బ్యాచులలో 126 మందికి శిక్షణ అందించినట్లు ఆయన వివరించారు. శిక్షణా తరగతులలో అడవులు,మైదాన ప్రాంతాల్లో లభించే వనమూలికల పరిచయం, ఆయుర్వేద మందుల తయారీ, వినియోగ పద్ధతులు,నిర్దిష్ట వ్యాధులకు అనువైన మూలికల ఎంపిక,అంతరించిపోతున్న అరుదైన ఔషధ మొక్కల సంరక్షణ,ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రులు, ప్రసిద్ధ ఫార్మసీలకు విద్యార్థుల అధ్యయన పర్యటన,వ్యక్తిత్వాభివృద్ధి, ప్రజాసేవా దృక్పథంపై శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అలానేశిక్షణను పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరిగిందని అన్నారు.ఈకార్యక్రమానికి హాజరైన కడియం గ్రామానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు శెట్టి సత్యనారాయణ ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతపై విలువైన సూచనలు అందించారు. శిక్షణార్థులతో కలిసి వేమగిరి బుద్ధ విహార్, స్థానిక నర్సరీలను సందర్శించినట్లు బుల్లియ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు ఆకాశం గౌరీష్ బాబు, వెంకటేశ్వరరావు (పాలెం డాక్టర్) చంద్ర శేఖర్,బుద్ధ విహార్ యార్లగడ్డ జగదీశ్వర్ రావు తదితరులు ఉన్నారు.

# చేనేత కార్మికుడు నిల్లా వీర్రాజుకి సహాయం

### సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మందులకు ఆర్థిక సాయం, కిరాణా అందజేత



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** కడియం మండలం పొట్టిలంక గ్రామ వాస్తవ్యుడు నిల్లా వీర్రాజు అనే 58 సంవత్సరాల వ్యక్తి చేనేత కార్మికుడు దురదృష్టవ శాస్తూ అతని హార్ట్ లో 4 వాల్వ్ బ్లాక్ అవడం, అత్యవసరంగా ఆరోగ్యశ్రీ మీద సర్జరీ చేసి, రెండు వాల్వ్ స్టంట్సు వేసి, మిగతా రెండు వాల్వ్ కి టెంపరరీ అడ్జస్ట్మెంట్ చేసి ఇంటికి పంపించడం జరిగింది. అతని భార్యకి నేత పని రాకపోవడం వల్ల,అతను అనారోగ్యం వల్ల పనిచేయలేక,పోషణ లేక మరియు ప్రతినెల ఐదు వేల రూపాయలకు పైగా అయ్యే మందుల ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్నాడు. గురువారం ఉదయం సత్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పొట్టిలంక గ్రామ వాస్తవ్యుడు, అనారోగ్యం మరియు పేదరికంతో బాధపడుతున్న చేనేత కార్మికుడు నిల్లా వీర్రాజుకి సహాయం చేయడం జరిగింది. అతనికి అవసరమైన మందులు కొనుక్కోవడానికి రూ.4,000/- ఇచ్చి, రెండు నెలలకు సరిపడా రైస్ మరియు కిరాణా సామాన్లు కూడా ఇవ్వడం జరిగింది. సత్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తమ్మా రవి మాట్లాడుతూ కులం, మతం,ప్రాంతం అనే వివక్ష లేకుండా అనాథలకు, అన్నార్తులకు,ఆపదలో ఉన్నవారికి సత్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 3 సంవత్సరాల్లో 300 కు పైగా సేవా కార్యక్రమాలు,ట్రస్ట్ సభ్యుల సహకారంతో చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ ఎం వి ఆర్ ఎఫ్ శాస్త్రి ,ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ చిలుకోటి పోశయ్య,సభ్యులు వీరా వేణి,టి వినోద్ కుమార్ మొదలగు వారందరూ పాల్గొని,ఆ పేద చేనేత కార్మికునికి ఆపద సమయంలో అండగా ఉండటం జరిగింది.

# మున్సిపల్ కార్మికులు జీతాలు విడుదల చేయాలి



### మున్సిపల్ కార్మికులు ధర్నా

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగంలో ఆప్కాస్ కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు మంజూరు కాలేదని ఈ పండగ సమయంలో జీతాలు మంజూరు కాకపోతే కార్మికులు ఆర్థిక మానసిక ఆవేదన చెందుతున్నారని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు తెలిపారు. గురువారం ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులను కలిసి కార్మికులకు జీతాలు వెంటనే మంజూరు చేయాలని వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఆనాడు సమ్మె కాలంలో ప్రతి పండక్కి బోనస్ ఇస్తామని చెప్పారని గత రెండు సంవత్సరాలుగా బోనస్ మంజూరు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు బ్యాంకు ఖాతాలు మారుస్తే జీతాలు పడవని మేమందరం చెప్పిన వినలేదని ఇప్పుడు యాక్సిస్ బ్యాంక్ కు మారడం వల్ల జీతాలు పెండింగ్లో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు అధికారులను కలిసిన వారిలో మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు రెడ్డి రమణ,జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వర రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తెనాలి, దుర్గమ్మ, ఆఫీస్ బేరర్స్ కాకి శారద,బంగారు గిరి,గూడపు గిరి పోలమ్మ,బాలు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# ఇండిగో విమానాలు సాధారణంగా తిరిగి ప్రారంభం : ఏపీడి ఎన్.కె శ్రీకాంత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్,ఇండియాస్ అథారిటీ అధికారులు అందిస్తున్న సమాచారం ప్రకారం,ఇండిగో విమానాల కార్యకలాపాలు సాధారణ స్థితికి తిరిగి వచ్చాయనీ ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఎన్ కే శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. ఎయిర్‌పోర్ట్ నుండి రోజువారీంగా మొత్తం 10 షెడ్యూల్డ్ ఫ్లైట్‌లు ఉంటాయను,ప్రస్తుతం 9 ఫ్లైట్‌లు సాధారణంగా ఆపరేట్ అవుతున్నాయి. అయితే, ఢిల్లీ రాజమహేంద్రవరం- దేశు రూట్ 6 ఈ -0364/0363 విమానం ఆపరేషన్ పరిమితుల కారణంగా 11 డిసెంబరు 2025 వరకు రద్దు చేయబడినట్లు ఎయిర్లైన్ ద్వారా సమాచారం అందిందన్నారు. అలయన్స్ ఎయిర్ ద్వారా తిరుపతి రూట్‌లో ఆపరేషన్లు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయన్నారు. ఎయిర్‌పోర్ట్‌లో అన్ని కార్యకలాపాలు సజావుగా కొనసాగుతున్నాయనీ, విమానాశ్రయ అధికారి ఎయిర్లైన్స్‌తో సమన్వయం కలిగి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగ కుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ అధికారులు ప్రయాణికుల సహకారం కోసం కృతజ్ఞతలు తెలిపారు ప్రయాణికులకు భద్రత, సమర్థత, సజావుగా సేవలు అందించడంలో కట్టుబడినట్లు ఆయన తెలిపారు.

# అందరూ కచ్చితంగా చూడాల్సిన సినిమా,,

## ఓటీటీ టాప్ ట్రెండింగ్ మూవీపై జాన్వీ ప్రశంసలు



ఎన్టీఆర్ దేవర సినిమాతో తెలుగు ఆడియెన్స్‌ను పలకరించింది బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో కలిసి పెద్ది అనే సినిమాలో నటిస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ జూనియర్ శ్రీదేవి ఓ తెలుగు సినిమాపై ప్రశంసల వర్షం కురిపించింది. జయాపజయాలతో సంబంధం లేకుండా హిందీలో వరుసగా సినిమాలు చేస్తోంది జాన్వీ కపూర్. ఈ ఏడాది ఆమె నటించిన 'హోమ్‌బౌండ్', 'పరమ్ సుందరి', 'సన్నీ సంస్కారి కి తులసి కుమారి' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఇందులో 'హోమ్‌బౌండ్' మూవీ ఏకంగా ఆస్కార్ కు నామినేట్ అయ్యింది. ఇక గతేడాది ఎన్టీఆర్ దేవర సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను పలకరించిన జాన్వీ ఇప్పుడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తో కలిసి ఆడిపాడుతోంది. బుచ్చిబాబు సనా తెరకెక్కించిన ఈ మెగా మూవీలో జాన్వీ ఓ డిఫరెంట్ రోల్ లో కనిపించనుంది. ఇప్పటికే పెద్ది సినిమా నుంచి రిలీజైన జాన్వీ ఫస్ట్ లుక్ కు అభిమానుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇదిలా ఉంటే ఈ జూనియర్ శ్రీదేవి లేటెస్ట్ గా ఓ తెలుగు సినిమాపై ప్రశంసల వర్షం కురిపించింది. ఇటీవలే ఓటీటీలోకి వచ్చి ప్రస్తుతం టాప్ ట్రెండింగ్ లో దూసుకెళుతోన్న ఈ మూవీని అందరూ చూడాలని కోరింది. ఇంతకు ఆ సినిమా ఏదనుకుంటున్నారా? నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ లవ్ స్టోరీ నవంబర్ 7న థియేటర్లలో విడుదలైంది. డిసెంబర్ 5 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాకు ఓటీటీలో విశేష స్పందన లభిస్తోంది. తాజాగా హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా ఈ సినిమాను చూసి ఫిదా అయింది. అనంతరం తన అభిప్రాయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ' 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో రంగులు పూసుకుని, మైక్ ముందు నిల్చుని, కళ్లపై పడుతున్న కాంతిని అడ్డుకుంటున్న రష్మిక ఫొటోను షేర్ చేసిన జాన్వీ.. 'ది గర్ల్‌ఫ్రెండ్. మాండేటరీ వాచ్ (తప్పక చూడాల్సిన సినిమా)' అని రాసుకొచ్చింది. దీనికి కన్నీళ్లతో ఉన్న ఎమోజీ, చప్పట్ల ఎమోజీలను జత చేసింది. ఇక జాన్వీ కపూర్ ప్రశంసలపై దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించాడు. "ఆమెది చాలా మంచి మనసు" అంటూ హార్ట్ ఎమోజీతో కృతజ్ఞతలు తెలిపాడు.

# నమ్మండి మావ.!

## ఈ బ్యూటీ సీరియల్ నటే..

### అందాలతో దుమ్మురేపిన భామ



సీరియల్ నటీమణుల ఫోటోలు నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. హీరోయిన్స్ కు సమానంగా తమ అందాలతో సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తున్నారు సీరియల్ భామలు. ఈక్రమంలోనే ఓ సీరియల్ బ్యూటీ తన ఫొటోలతో మెప్పిస్తుంది. ఈ అందాల తారను గుర్తుపట్టారా..? లాక్ డౌన్ తర్వాత సీరియల్స్ చూసే ఆడియన్స్ సంఖ్య భారీగా పెరిగిపోయింది. రకరకాల సీరియల్స్ ఇప్పుడు ప్రేక్షకులను ఆకట్టుకుంటూ దూసుకుపోతున్నాయి. సినిమాలకు సమానంగా సీరియల్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక సీరియల్స్‌లో నటించిన చాలా మంది ముద్దుగుమ్మలు ఇప్పుడు సినిమాల్లోనూ అవకాశాలు అందుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. సీరియల్స్ లో నటించే చాలా మంది ముద్దుగుమ్మలు.. సినిమా హీరోయిన్స్ కు మించిన అందంతో కట్టిపడేస్తున్నారు. సీరియల్స్ లో చీరకట్టులో యావరేజ్ గా కనిపించే భామలు.. సోషల్ మీడియాలో మాత్రం వారెవ్వా అనేలా తమ అందాలతో మతిపోగొడుతున్నారు. తాజాగా అలాంటి వయ్యారి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడి లేటెస్ట్ ఫొటోలతో టాక్ ఆఫ్ ది సోషల్ మీడియాగా మారిపోయింది ఇంతకూ ఆ అమ్మడు ఎవరో గుర్తుపట్టారా.? స్టార్ మా లో టెలికాస్ట్ అవుతున్న సీరియల్ చాలా ప్రేక్షకులను మెప్పిస్తూ మంచి రేటింగ్ తో దూసుకుపోతున్నాయి. అలాంటి సీరియల్స్ లో మల్లి సీరియల్ ఒకటి. ఆకట్టుకునే కథాంశంతో టెలికాస్ట్ అవుతున్న ఈ సీరియల్ కు మంచి ప్రేక్షాదరణ ఉంది. ఇక ఈ సీరియల్ లో నటించిన లాస్య తన నటనతో అందరి దృష్టిని ఆకర్షించింది. మల్లి సీరియల్‌లో పద్ధతికి చీర కట్టినట్లుగా ఉండే లాస్య బయట మాత్రం చాలా మోడ్రన్‌గా ఉంటుంది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫొటోలు మాములుగా ఉండవు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే లాస్య తన క్రేజీ ఫొటోలతో అభిమానులను కవ్విస్తుంది. ఈ అమ్మడి ఫోటోలు చూసిన నెటిజన్స్ సీరియల్ కు సోషల్ మీడియాలో ఇంత చేంజ్ ఏంటో.. అంటూ షాక్ అవుతున్నారు. ఈ అమ్మడు మోడ్రన్ డ్రస్సుల్లో ఫోటోలు వదిలింది. తాజాగా అదిరిపోయే డ్రస్ లో వారెవ్వా అనిపించేలా ఫోటోలకు ఫోజులిచ్చింది లాస్య. ఇన్ స్టా గ్రామ్ లో ఈ అమ్మడి 2లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు.

# 17 బౌండరీలతో 143 పరుగులు..

## మరోసారి ఐపీఎల్ బుడ్డోడి బీభత్సం.. ఎక్కడ, ఎప్పుడంటే?



372 రోజుల తర్వాత, వైభవ్ సూర్యవంశీ మరోసారి అండర్-19 ఆసియా కప్‌లో UAEతో తలపడనున్నాడు. వైభవ్ ఈ జట్టును చివరిసారి ఎదుర్కొన్నట్లే, ఈ మ్యాచ్‌లో కూడా మొదటి బంతి నుంచే దాడి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటాడు. ఆసియా అండర్-19 జట్లలో అత్యుత్తమంగా నిలిచే పోటీ ప్రారంభం కానుంది. డిసెంబర్ 12న ప్రారంభమయ్యే ఈ టోర్నమెంట్‌లో భారత జట్టు తన మొదటి మ్యాచ్ ఆతిథ్య UAEతో ఆడనుంది. ఈ మ్యాచ్‌లో అందరి దృష్టి వైభవ్ సూర్యవంశీపై ఉంటుంది. వైభవ్ బ్యాటింగ్ ఈ సంవత్సరం అతన్ని ప్రసిద్ధి చేసింది. ఇది UAEతో భారత అండర్-19 తరపున వైభవ్ సూర్యవంశీ ఆడిన రెండవ వన్డే అవుతుంది. గత సంవత్సరం ఆసియా కప్‌లో UAE అండర్-19తో జరిగిన తన మునుపటి వన్డే మ్యాచ్‌లో ఆడిన సంగతి తెలిసిందే. అక్కడ అతని తుఫాన్ ఓపెనింగ్ ప్రదర్శనతో భారత జట్టు 10 వికెట్ల తేడాతో అద్భుతమైన విజయాన్ని నమోదు చేయడంలో సహాయపడింది. గత అండర్-19 ఆసియా కప్‌లో, యూఏఈపై 10 వికెట్ల తేడాతో విజయం సాధించిన వైభవ్ సూర్యవంశీకి మరో ఎండ్ నుంచి ఆయుష్ మాత్రే గణనీయమైన మద్దతు ఇచ్చాడు. ఇద్దరు బ్యాట్స్‌మెన్‌లు యూఏఈ బౌలర్లలో ఎవరినీ తమను ఎదుర్కొనేందుకు అనుమతించలేదు. 50 ఓవర్ల లక్ష్యాన్ని కేవలం 17వ ఓవర్‌లోనే ఛేదించారు.

**చివరిసారిగా పోరు యు19 ఆసియా కప్‌లోనే..**

గత ఆసియా కప్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో యుఎఇ అండర్-19 జట్టు పూర్తి 50 ఓవర్లు ఆడలేకపోయింది. ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ 44 ఓవర్లలో 137 పరుగులకే ఆలౌట్ అయింది. ఇండియా అండర్-19 జట్టుకు 138 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, ఓపెనర్ల జోడీ వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ మాత్రే లక్ష్యాన్ని ఛేదించడానికి క్రీజులోకి వచ్చారు.

**వైభవ్, ఆయుష్ 17 సిక్సర్లు, ఫోర్లతో 143 పరుగులు..**

యూఏఈతో జరిగిన ఆ మ్యాచ్‌లో వైభవ్, ఆయుష్ క్రీజులోకి అడుగుపెట్టిన వెంటనే తమ ఉద్దేశాలను స్పష్టం చేశారు. యూఏఈ అండర్-19 జట్టుపై దాడి ఒక చివర నుంచి మాత్రమే కాకుండా, రెండు ఎండ్‌ల నుంచి ప్రారంభమైంది. ఫలితంగా, ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ అజేయంగా నిలిచారు. కేవలం 16.1 ఓవర్లలో 17 సిక్సర్లు, ఫోర్లతో సహా 143 పరుగులు చేశారు.

**వైభవ్ సూర్యవంశీ 6 సిక్సర్లతో 76 పరుగులు..**

వైభవ్ సూర్యవంశీ 46 బంతుల్లో 165.22 స్ట్రైక్ రేట్‌తో 76 అజేయంగా నిలిచాడు. అందులో ఆరు సిక్సర్లు, మూడు ఫోర్లు ఉన్నాయి. మరోవైపు, ఆయుష్ మాత్రే కూడా 51 బంతుల్లో 131.37 స్ట్రైక్ రేట్‌తో 67 పరుగులు చేశాడు. అందులో నాలుగు సిక్సర్లు, నాలుగు ఫోర్లు ఉన్నాయి. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అండర్-19 ఆసియా కప్‌నకు వేదిక సిద్ధమైంది. ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారు. జట్లు సిద్ధంగా ఉన్నాయి. భారత అండర్-19 జట్టులో భాగమైన వైభవ్ సూర్యవంశీ మరోసారి సిక్స్‌లు కొట్టి, పరుగులు సాధించి, యూఏఈ అండర్-19 జట్టును నాశనం చేయాలని ఆసక్తిగా ఉన్నాడు.

### రెండో మ్యాచ్‌లో సరికొత్త

# చరిత్ర సృష్టించనున్న హార్దిక్..

## ఆ లిస్ట్‌లో తొలి ప్లేయర్‌గా భారీ రికార్డ్



చండీగఢ్‌లోని కొత్త మైదానంలో జరుగుతున్న రెండవ టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో, హార్దిక్ పాండ్యా భారత్‌ను విజయపథంలో నడిపించడమే కాకుండా చరిత్ర సృష్టించాలని కూడా చూస్తున్నాడు. దీంతో అలా చేసిన మొదటి ఆటగాడిగా మారవచ్చు. భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండవ టీ20ఐ చండీగఢ్‌లోని కొత్త స్టేడియంలో జరుగుతుంది. ముల్లన్‌పూర్‌లోని కొత్తగా పూర్తయిన స్టేడియంలో పురుషుల క్రికెట్ జట్టు అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. కటక్‌లో సాధించిన విజయంతో టీమిండియా బరిలోకి దిగనుంది. తొలి విజయంలో హీరో హార్దిక్ పాండ్యా భారతదేశాన్ని విజయపథంలో నడిపించి, ప్రత్యేకమైన చరిత్ర సృష్టించాలని చూస్తాడు.

**హార్దిక్ పాండ్యా శైలి భిన్నంగా ఉంటుంది..!**

హార్దిక్ పాండ్యా కంటే ముందు ముగ్గురు లేదా నలుగురు ఆటగాళ్ళు టీ20ల్లో ఆ ఘనతను సాధించారు. కానీ ఇప్పుడు హార్దిక్ పాండ్యా ఆ జాబితాలో చేరడంతో, అతను ఇతరుల నుంచి కొంచెం భిన్నంగా ఉంటాడు.

**హార్దిక్ పాండ్యా ఖాతాలో సరికొత్త చరిత్ర..**

దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టీ20లో వికెట్ తీసి హార్దిక్ పాండ్యా చరిత్ర సృష్టించనున్నాడు. రెండో టీ20లో వికెట్ తీయడం ద్వారా అతని 100వ టీ20 వికెట్‌గా రికార్డు సృష్టించనున్నాడు. టీ20ల్లో 100 సిక్సర్లు, 100 వికెట్లు తీసిన నాల్గవ ఆటగాడిగా కూడా అతను రికార్డు సృష్టించనున్నాడు. అయితే, ఈ ఘనత సాధించిన తొలి పేస్ ఆల్ రౌండర్‌గా అతను రికార్డు సృష్టించనున్నాడు. అతని కంటే ముందు ఈ ఘనత సాధించిన ముగ్గురు ఆటగాళ్లు జింబాబ్వేకు చెందిన సికందర్ రజా, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన మహ్మద్ నబీ, మలేషియాకు చెందిన వీరన్‌దీప్ సింగ్. ఈ ముగ్గురూ స్పిన్ ఆల్ రౌండర్లు. దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టీ20లో ఒక వికెట్ పడగొట్టడం ద్వారా, హార్దిక్ పాండ్యా పురుషుల టీ20ల్లో 1,000 పరుగులు, 100 వికెట్లు తీసిన నాల్గవ క్రికెటర్ అవుతాడు. అయితే, అతను వారిలో ఏకైక పేస్ ఆల్ రౌండర్ అవుతాడు. అతని కంటే ముందు, బంగ్లాదేశ్‌కు చెందిన షకీబ్ అల్ హసన్, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన మహ్మద్ నబీ, జింబాబ్వేకు చెందిన సికందర్ రజా ఈ ఘనతను సాధించారు. అయితే, ఈ ముగ్గురూ స్పిన్ ఆల్ రౌండర్లు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో హార్దిక్ పాండ్యా అజేయంగా హాఫ్ సెంచరీ సాధించాడు. ఇప్పుడు, కటక్‌లో జరిగిన రెండో టీ20లో అతను ఎక్కడ వదిలేశాడో అక్కడి నుంచి తిరిగి రాణించాలని చూస్తున్నాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com